మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 16-9-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 78 Issue: 78

16 సెప్టెంబర్ 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:07 సూర్యాస్తమయం - సా. 6:14 తిథి పంచమి ఉ. 9:01 వరకు తరువాత షష్టి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం విశాఖ సా. 5:19 వరకు తరువాత అనురాధ యోగం వైధృతి మ. 12:14 వరకు కరణం బాలవ ఉ. 9:01 వరకు కౌలవ రా. 9:53 వరకు వర్జ్యం రా. 9:47 నుండి రా. 11:33 వరకు దుర్ముహూర్తం ఉ. 11:46 నుండి మ. 12:35 వరకు రాహుకాలం మ. 12:10 నుండి మ. 1:41 వరకు యమగండం ఉ. 7:38 నుండి ఉ. 9:09 వరకు గుళికాకాలం ఉ. 10:40 నుండి మ. 12:10 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:31 నుండి తె. 5:19 వరకు అమృత ఘడియలు ఉ. 7:53 నుండి ఉ. 9:37 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial

# మోదీ చార్జీల బాంబ్




## యూపీఐ లావాదేవీలపై బాదుడు



**డిజిటల్ చెల్లింపుల భవిష్యత్తుపై నీలినీడలు**

**నగదు రహితం ఇక చార్జీల సహితం**

**వ్యక్తి-వ్యాపారి ట్రాన్సాక్షన్‌కే వర్తింపు**

**2 వేలు దాటితే ఎండీఆర్ చార్జీలు**

(ఈవార్తలు-స్పెషల్ డెస్క్)

దేశంలో నగదు రహిత ఆర్థిక వ్యవస్థకు యూపీఐ వెన్నెముకగా మారింది. టీ స్టాల్ నుంచి పెద్ద దుకాణం వరకు.. కూరగాయల బండి నుంచి దవాఖాన వరకు.. చిన్న చెల్లింపుల నుంచి భారీ కొనుగోళ్ల వరకు డిజిటల్ చెల్లింపులు ప్రజల నిత్యజీవితంలో భాగమయ్యాయి. ఇలాంటి సమయంలో యూపీఐ లావాదేవీలపై కొత్తగా ఎండీఆర్ విధించే నిర్ణయంతో ప్రజలపై తీవ్ర ప్రభావం చూపనుంది.కే ంద్రం, ఎన్‌పీసీఐ మాత్రం వినియోగదారుడిపై నేరుగా ఎలాంటి చార్జీ ఉండదని స్పష్టం చేస్తున్నాయి. రూ.2,000 వరకు యూపీఐ చెల్లింపులు ఉచితంగానే కొనసాగుతాయి. రూ.2,000 దాటిన వ్యక్తి-వ్యాపారి లావాదేవీలకు 0.4 శాతం ఎండీఆర్ వర్తిస్తుంది. కొన్ని రంగాలకు ఒక్కో లావాదేవీకి రూ.5 చొప్పున తరువాయి 2 వ పేజీలో...



# మనిషిపై.. AI బాంబ్

కృత్రిమ మేధస్సు ప్రపంచాన్ని మార్చేస్తున్న వేగం ఇప్పుడు ఆశ్చర్యాన్ని దాటి ఆందోళనకు చేరుతోంది. నిన్నటి వరకు మనిషి పనిని సులభతరం చేసే సాధనంగా కనిపించిన ఏఐ.. నేడు స్వతంత్రంగా ఆలోచించే, నిర్ణయాలు తీసుకునే, సంక్లిష్టమైన పనులను పూర్తి చేసే దిశగా దూసుకుపోతోంది. మరికొంత కాలంలో మనుషుల సామర్థ్యాలను అనేక రంగాల్లో అధిగమించే 'సూపర్‌ఇంటెలిజెన్స్' వస్తుందన్న అంచనాలు టెక్ ప్రపంచంలో వినిపిస్తున్నాయి.

**సూపర్ ఇంటెలిజెన్స్‌తో పెను ముప్పు.. మనుషుల చేతుల్లో లేకపోతే అనర్థం**

**మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల వార్నింగ్.. నైతిక బాధ్యత వహిస్తూ పలువురి రాజీనామా**

వాషింగ్టన్: ఆ మేధస్సును సృష్టించిన తర్వాత దానిపై నియంత్రణ ఎవరిది? అన్న ప్రశ్నకు మాత్రం స్పష్టమైన సమాధానం కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల చేసిన తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అత్యంత శక్తివంతమైన ఏఐ వ్యవస్థలు ఎట్టి పరిస్థితుల్లోనూ మానవ నియంత్రణలోనే ఉండాలని స్పష్టం చేశారు. ఏఐ అభివృద్ధి వేగం కంటే భద్రతా వ్యవస్థల అభివృద్ధి వెనుకబడకూడదని, అవసరమైతే వేగాన్ని నియంత్రించి పరీక్షలు, పర్యవేక్షణ, బాధ్యతాయుతమైన -2 వ పేజీలో...

# నవంబర్ 19 నుంచి 'రాజీవ్ యువ వికాసం'



## ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి పెద్దపీట: భట్టి

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సంక్షేమం, అభ్యున్నతికే ప్రజా ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని, విద్యారంగ అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఖర్చు చేయడానికి వెనుకాడబోమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో పేద, బహుజన వర్గాల భవిష్యత్తును తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): సోమవారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమక్షానికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హాజరయ్యారు. సంక్షేమ పథకాల అమలు, గురుకులాల నిర్వహణ, విద్యా మౌలిక వసతులు, స్వయం ఉపాధి, స్కాలర్‌షిప్‌లు, సర్కిళ్లు, తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. యువతకుతరువాయి 2 వ పేజీలో...

# 'కుట్టు మిషన్' దరఖాస్తుల గడువు పెంపు



## ఈ నెల 30 వరకు పొడిగిస్తూ సర్కారు నిర్ణయం

బీసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించి, వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 30 వరకు పొడిగించినట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1.19 లక్షల మంది అర్హులైన బీసీ మహిళలకు ఆటోమేటిక్ కుట్టు మిషన్లను 100 శాతం సబ్సిడీపై అందించనున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులైన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఈ నెల 30వ తేదీలోగా టిజిఓబిఎంఎంఎస్ పోర్టల్ ద్వారాతరువాయి 2 వ పేజీలో...

# తెలుగు రాష్ట్రాలకు 5 లక్షల ఇళ్లు



## ఏపీకి 3 లక్షలు, టీజీకి 2 లక్షల ఇళ్లు కేటాయింపు

ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద తెలుగు రాష్ట్రాలకు కేంద్రం అదనంగా మరో 5 లక్షల ఇళ్లను మంజూరు చేసింది. ఇప్పటికే కేటాయించిన ఇళ్లకు అదనంగా ఈ ఇళ్లను అందించనుంది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయించింది.

న్యూఢిల్లీ: ఈ నిర్ణయంతో రెండు రాష్ట్రాల్లోని ఇళ్లు లేని పేద కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హత ఉన్న కుటుంబాలు సొంతింటి నిర్మాణానికి కేంద్రం అందించే సాయాన్ని పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాలకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద భారీగా ఇళ్లను కేటాయించిన కేంద్రం.. తాజాగా మరో 5 లక్షల ఇళ్లకు ఆమోదం తెలిపింది. కొత్త కేటాయింపులతో మరింత మంది తరువాయి 2 వ పేజీలో...




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,458 |
| వెండి (కిలో): | రూ.2.,50,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,507 |

# 9 లక్షల కోట్లు ఆవిరి

## స్టాక్ మార్కెట్లలో బ్లడ్ బాత్.. అంతర్జాతీయ పరిస్థితులే కారణం

దేశీయ ఈక్విటీ బెంచ్ మార్క్ సూచీలు భారీగా నష్టపోయాయి. సోమవారం వినాయక చవితి సందర్భంగా స్టాక్ మార్కెట్లకు సెలవు కావడంతో ట్రేడింగ్ జరగలేదు. దీంతో మూడు రోజుల విరామం అనంతరం మంగళవారం మళ్లీ మార్కెట్లు ప్రారంభం అయ్యాయి. అయితే అంతర్జాతీయ ప్రతికూల సంకేతాలు అందడంతో స్టాక్ మార్కెట్లలో బ్లడ్ బాత్ ఉంటుందని విశ్లేషకులు ముందుగానే అంచనా వేశారు.



మంగళవారం, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): భారీగా పెరుగుతున్న చమురు ధరలతోపాటు అమెరికా బాండ్ ఈల్డ్స్ పెరిగిన కారణాలతో స్టాక్ మార్కెట్లపై ఒత్తిడి నెలకొంది. దీంతో పెట్టుబడిదారులు అమ్మకాలకే మొగ్గు చూపారు. ఈ క్రమంలో మంగళవారం సెషన్‌లో సెన్సెక్స్ 778 పాయింట్లు పతనమై 74,004 వద్ద ముగిసింది. నిఫ్టీ 280 పాయింట్లు తగ్గి 23,119 వద్ద స్థిరపడింది. దీంతో నిఫ్టీ ఐదు నెలల కనిష్ఠ స్థాయికి చేరుకుంది. ఫైనాన్షియల్స్, రక్షణ, క్యాపిటల్ గూడ్స్ రంగాల షేర్లలో భారీ అమ్మకాలు వెల్లువెత్తాయి. విస్తృత మార్కెట్ కూడా తీవ్ర ఒత్తిడికి గురైంది. మిడ్‌క్యాప్ సూచీ 1,319 పాయింట్లు, అంటే 2 శాతానికి పైగా పడిపోయి 60,878 వద్ద ముగిసింది. నిఫ్టీలోని 50 షేర్లలో 40 షేర్లు నష్టాల్లో ముగిశాయి. అడ్వాన్స్-డిక్లైన్ నిష్పత్తి 1:5గా నమోదైంది. బీఎస్ఈలో లిస్టైన కంపెనీల తరువాయి 2 వ పేజీలో...



# లోతుకుంట భూములు ప్రైవేటువే

## హైడ్రాకు షాకిచ్చిన సుప్రీం కోర్టు

**219 రోజులు ఆలస్యంగా స్పెషల్ లీవ్ పిటిషన్**

**అందుకే పిటిషన్ డిస్మిస్ : ధర్మాసనం**

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో హైడ్రాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కంటోన్మెంట్ పరిధిలోని లోతుకుంటలో సర్వే నంబర్లు 1, 2లోని 40 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనంటూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ జస్టిస్ దీపంకర్ తరువాయి 2 వ పేజీలో...



# రోదసిలో రక్తపుటేర్లు!?

**అంతరిక్షంలో అమెరికా ఆయుధాలు**

**కక్ష్యలో ఆయుధాలు ఉన్నట్లు ప్రకటన**

**ఆయుధాల సంఖ్య, స్థానాన్ని వెల్లడించని అగ్రరాజ్యం**

వాషింగ్టన్: అంతరిక్షంలో తమ వద్ద ఆయుధాలు ఉన్నాయని అమెరికా తొలిసారి బహిరంగంగా ప్రకటించింది. ఇప్పటికే కొన్ని 'స్పేస్ కంట్రోల్ వెపన్స్' కక్ష్యలో ఉన్నాయని అమెరికా స్పేస్ ఫోర్స్ వెల్లడించింది. శత్రు దేశాల దాడుల నుంచి అమెరికా, మిత్రదేశాల బలగాలను రక్షించేందుకే వీటిని మోహరించినట్లు తెలిపింది. అయితే ఆయుధాల సంఖ్య, వాటి స్థానం, ఏ తరహా వ్యవస్థలను ఉపయోగిస్తున్నారన్న వివరాలను మాత్రం వెల్లడించలేదు. అమెరికా ఎయిర్‌ఫోర్స్ -2 వ పేజీలో...

## విశ్వవాణి



**19 నుంచి 'నైరుతి' తిరోగమనం**

న్యూఢిల్లీ: దేశంలో నైరుతి రుతుపవనాల తిరోగమన ప్రక్రియ ప్రారంభానికి సమయం ఆసన్నమైందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అధికారికంగా వెల్లడించింది. ఈ నెల 19వ తేదీ నుంచి పశ్చిమ రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి రుతుపవనాల ఉపసంహరణకు పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని ఒక ప్రకటనలో పేర్కొంది. సాధారణంగా సెప్టెంబర్ 17న ప్రారంభం కావాల్సిన ఈ ప్రక్రియ, ఈ ఏడాది రెండు రోజులు ఆలస్యంగా మొదలవుతోంది. రాజస్థాన్‌లో ఉపసంహరణ ప్రారంభమైనప్పటికీ.. మధ్య, తూర్పు, దక్షిణ భారతదేశంలోని పలు ప్రాంతాల్లో సెప్టెంబర్ 21 వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని ఐఎండీ స్పష్టం చేసింది. ముఖ్యంగా 18 నుంచి 20 మధ్య కోస్తాంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం రుతుపవనాలపై తీవ్రంగా పడింది. సెప్టెంబర్ 13 నాటికి దేశవ్యాప్తంగా 15 శాతం మేర వర్షపాత లోటు నమోదైంది. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో 28 శాతం తక్కువ వర్షపాతం నమోదవడం గమనార్హం. రాష్ట్రాల వారీగా పరిశీలిస్తే.. ఆంధ్రప్రదేశ్‌లో 43 శాతం, కర్ణాటకలో 29 శాతం, కేరళలో 27 శాతం మేర వర్షపాత లోటు ఏర్పడింది.



# న్యాయవ్యవస్థనూ విమర్శించొచ్చు: సీజేఐ

న్యూఢిల్లీ: న్యాయవ్యవస్థ విమర్శలకు అతీతం కాదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో నిర్మాణాత్మకమైన విమర్శలు, పరిశీలనలు న్యాయవ్యవస్థ మరింత మెరుగ్గా పనిచేయడానికి సహాయపడతాయని పేర్కొన్నారు. సోమవారం ఢిల్లీలో జరిగిన 6వ రామ్ జెఠ్మలానీ స్మారక ఉపన్యాసతరువాయి 2 వ పేజీలో...

# ఆళ్ల నాని హఠాన్మరణం

## గుండెపోటుతో మృతి



వైజాగ్, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఏపీ మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. విశాఖలోని తన నివాసంలో ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేలోపే ప్రాణాలు విడిచారు. ఆయన ఆకస్మిక మృతి వార్త ఏలూరు నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వర్గాలను, పార్టీ శ్రేణులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆళ్ల నాని వయసు 56 సంవత్సరాలు. 1969లో ఏలూరులోని శనివారపుపేటలో జన్మించారు. ఏలూరు సి.ఆర్.రెడ్డి కాలేజీలో ఇంటర్మీడియట్, ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో బీకామ్ పూర్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన ఆళ్ల నాని, 2004లో తొలిసారిగా ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 2009లో కూడా కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా తరువాయి 2 వ పేజీలో...



# ట్రంప్ మా పథకాలను కాపీ కొడుతున్నాడు: డీకే

బెంగళూరు: కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ గ్యారెంటీ పథకాలు అంతర్జాతీయ స్థాయిలో ప్రజాదరణ పొందాయని, చివరికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా తమ పథకాలనే కాపీ కొడుతున్నారని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే తరువాయి 2 వ పేజీలో...

# నవంబర్ 19 నుంచి 'రాజీవ్ యువ వికాసం'

**మొదటి పేజీ తరువాయి**



స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గత పదేళ్లలో అధికారంలో ఉన్న ప్రభుత్వం యువశక్తిని నిర్వీర్యం చేసిందని, సంక్షేమ శాఖల కార్పొరేషన్ల ద్వారా యువతకు అవసరమైన ప్రోత్సాహకాలు అందించలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం యువతకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, రాజీవ్ యువ వికాసం పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించామని చెప్పారు. నవంబర్ 19 నుంచి లబ్ధిదారులకు స్వయం ఉపాధి యూనిట్ల కోసం తొలి విడతగా రూ.లక్ష వరకు ఆర్థిక సహాయం అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ 19న రాజీవ్ యువ వికాసం యూనిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని, రూ.లక్షలోపు ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి తొలి విడతలో యూనిట్లు మంజూరు చేయాలని సూచించారు. లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను కార్యాలయాల్లోనే స్వీకరించాలని, ఎంపిక ప్రక్రియను కలెక్టర్ల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. రెసిడెన్షియల్ పాఠశాలల కోసం కేంద్రీకృత యంత్రాల వంటశాలలు ఏర్పాటు చేసే ప్రతిపాదనపై సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలోని ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నిత్యం శుభ్రమైన, నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ గురుకుల పాఠశాలల్లో కేంద్రీకృత యంత్రాల వంటశాలలు ఏర్పాటు చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ఆధునిక వంటశాలల నిర్వహణ, యంత్రాల కొనుగోలు కోసం బడ్జెట్‌లో ఇప్పటికే రూ. 25 కోట్లను కేటాయించినట్లు గుర్తుచేశారు. ఈ నిధులను సమర్థవంతంగా వినియోగించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రాబోయే 15 రోజుల్లో రాష్ట్రంలోని అన్ని ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో మెకనైజ్డ్ కిచెన్ల ఏర్పాటు ఏ విధంగా పూర్తి చేస్తారనే దానిపై పక్కా కార్యాచరణ, స్పష్టమైన ప్రణాళికతో తమ ముందుకు రావాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. పాఠశాలల్లో ఆధునిక వంటశాలల నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు విద్యార్థుల భోజన వసతికి ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. అప్పటివరకు విద్యార్థులందరికీ నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని క్రమం తప్పకుండా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత బ్రేక్ ఫాస్ట్ పథకం అమలుకు వాడుతున్న కేంద్రీకృత యంత్రాల వంటశాలల నమూనాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ సెక్రెటరి విజయేంద్రబోయి, ట్రైబల్ వెల్ఫేర్ స్పెషల్ సెక్రెటరి సంతోష్, ఎస్సీ కార్పోరేషన్ వైస్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లయ్య బట్టు తదితరులు పాల్గొన్నారు.

# 9 లక్షల కోట్లు ఆవిరి

**మొదటి పేజీ తరువాయి**



మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజులో దాదాపు రూ.9 లక్షల కోట్ల మేర తగ్గిపోయింది. ఫైనాన్షియల్ స్టాక్స్, ఎన్‌బీఎఫ్‌సీ షేర్లు మార్కెట్‌లపై తీవ్ర ప్రభావం చూపాయి. నిఫ్టీ బ్యాంక్ సూచీ 812 పాయింట్లు పడిపోయి 55,795 వద్ద ముగిసింది. వడ్డీ రేట్లు పెరిగే అవకాశాలపై అంచనాలు పెరగడంతో శ్రీరామ్ ఫైనాన్స్, చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ వంటి నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల షేర్లలో అమ్మకాలు పెరిగాయి. విస్తృత మార్కెట్‌లో కూడా భారీ అమ్మకాలు నమోదయ్యాయి. మిడ్‌క్యాప్ సూచీ 1,319 పాయింట్లు, అంటే 2 శాతానికి పైగా నష్టపోయి 60,878 వద్ద ముగిసింది. అయితే కొన్ని రంగాలు మాత్రం మార్కెట్ పతనాన్ని ఎదుర్కొని లాభాల్లో నిలిచాయి. టాటా సన్స్ లిస్టింగ్‌పై అంచనాల నేపథ్యంలో టాటా గ్రూప్ షేర్లలో ఎక్కువ భాగం లాభాల్లో ముగిశాయి. టాటా కెమికల్స్ షేరు ఏకంగా 20 శాతం దూసుకెళ్లింది. మరోవైపు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో మందగమనంపై ఆందోళనలు ఉన్నప్పటికీ ఐటీ షేర్లు లాభపడ్డాయి. నిఫ్టీ ఐటీ సూచీ దాదాపు 3 శాతం పెరిగింది. సెన్సెక్స్ షేర్లలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, టెక్ మహీంద్రా, విప్రో, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రధాన లాభదారులుగా నిలిచాయి. భారత్ ఎలక్ట్రానిక్స్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్, శ్రీరామ్ ఫైనాన్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి.

### 150 డాలర్ల దిశగా బ్యారెల్ చమురు?

పశ్చిమాసియాలో చమురు సరఫరాలకు అంతరాయాలు కొనసాగితే బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 120 నుంచి 150 డాలర్ల వరకు పెరిగే అవకాశాలు ఉన్నాయని ఎఫ్‌జీఈ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఇమాన్ నస్సేరి అంచనా వేశారు. మధ్యప్రాచ్య సరఫరాలపై ఆందోళనలు కొనసాగుతుండటంతో చమురు ధరలు వరుసగా రెండో రోజు పెరిగాయి. సౌదీ అరేబియాలోని కీలకమైన ఈస్ట్-వెస్ట్ పైప్‌లైన్ ఇప్పటికీ పనిచేయకపోవడంతో బ్రెంట్ ధర బ్యారెల్‌కు 107 డాలర్లను దాటింది.

# లోతుకుంట భూములు ప్రైవేటువే

**మొదటి పేజీ తరువాయి**

దత్త ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. ఈ వివాదాస్పద 40 ఎకరాల భూమి శాంత శ్రీరామ్ కన్ స్ట్రక్షన్‌దేనని గతంలో హైకోర్టు కూడా తీర్పు వెల్లడించింది. దీన్ని సవాల్ చేస్తూ ఇది ప్రభుత్వ భూమి అంటూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌ను ఏకంగా 219 రోజుల ఆలస్యంగా దాఖలు చేశారనే కారణంతో డిస్మిస్ చేసింది. హైకోర్టు తీర్పును ఉల్లంఘించి శాంత శ్రీరామ్ కన్ స్ట్రక్షన్ సంస్థ భూమిలో హైడ్రా కూల్చివేతలకు కూడా పాల్పడింది. దీంతోనే హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను పదవి నుంచి తొలగించాలని, ఆయనపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని సింగిల్ జడ్జి ఆదేశాలు జారీ చేశారు. సింగిల్ జడ్జ్ ఇచ్చిన ఈ ఉత్తర్వులపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ డివిజన్ బెంచ్ ద్వారా స్టే పొందిన విషయం విదితమే.

# మోదీ చార్జీల బాంబ్

**మొదటి పేజీ తరువాయి**

స్థిర రుసుము ఉంటుంది. రూ.75 వేలకుపైగా లావాదేవీలకు ఎండీఆర్ గరిష్ఠంగా రూ.300గా పరిమితం చేశారు. చిన్న వ్యాపారులకు కొన్ని మినహాయింపులు కూడా ఉన్నాయి. కాగితంపై చూస్తే.. 'ప్రజలపై చార్జీ లేదు' అనే వివరణ ఆకర్షణీయంగానే కనిపిస్తుంది. కానీ అసలు ప్రశ్న అక్కడే మొదలవుతుంది. ఎండీఆర్ ఎవరు చెల్లిస్తారు? వ్యాపారి. మరి వ్యాపారి తన వ్యాపార వ్యయాన్ని ఎలా భరిస్తాడు? ధరల్లోకి ఆ ఖర్చు వెళ్లే అవకాశం లేదా? కేంద్రం మాత్రం ఈ రుసుమును వినియోగదారుడిపై మోపకూడదని బ్యాంకులకు సూచించింది. ఇదే విషయాన్ని మరింత విస్తృతంగా చూడాల్సిన అవసరం ఉంది. యూపీఐ లావాదేవీల్లో వ్యక్తి-వ్యాపారి చెల్లింపులే పరిమాణం పరంగా మెజారిటీ. తాజా వివరాల ప్రకారం వ్యక్తి-వ్యక్తి లావాదేవీలు మొత్తం వాల్యూమ్‌లో 37 శాతంగా ఉండగా, మిగిలిన సుమారు 63 శాతం వ్యక్తి-వ్యాపారి లావాదేవీలే. అంటే 'వ్యాపారులకు మాత్రమే వర్తిస్తుంది' అని చెప్పడం వల్ల ఈ నిర్ణయం చిన్న పరిధిలోనే ఉంటుందని భావించడానికి వీల్లేదు. ఇక్కడే ప్రభుత్వ విధానంపై మరో ప్రశ్న తలెత్తుతుంది. యూపీఐని ప్రజల రోజువారీ చెల్లింపు సాధనంగా మార్చింది దాని సరళత, వేగం, సౌలభ్యం, అదనపు రుసుము లేకపోవడం. ఇప్పుడు అధిక విలువ కలిగిన చెల్లింపులపై రుసుము విధించే వ్యవస్థ రావడం వల్ల వ్యాపారులు, వినియోగదారుల ప్రవర్తనలో మార్పులు వస్తాయా? అన్నది గమనించాల్సిన అంశం. ఉదాహరణకు ఒక కుటుంబం గృహోపకరణం కొనుగోలు చేస్తోంది. ఒక విద్యార్థి ఫీజు చెల్లిస్తున్నాడు. ఒక వ్యక్తి ఆసుపత్రి బిల్లు చెల్లిస్తున్నాడు. ఒక రైతు వ్యవసాయ పరికరం కొనుగోలు



చేస్తున్నాడు. ఇవన్నీ వ్యక్తి-వ్యాపారి లావాదేవీలే. వీటిలో రూ.2,000 దాటిన చెల్లింపులపై ఎండీఆర్ వ్యాపారి స్థాయిలో పడుతుంది. ప్రభుత్వం వినియోగదారుడిపై నేరుగా రుసుము విధించలేదన్నది వాస్తవమే. కానీ వ్యాపార వ్యయం పెరిగినప్పుడు దాని పరోక్ష ప్రభావం ధరలపై ఉండదని ముందుగానే చెప్పడం కూడా సులభం కాదు. ఇక్కడ మరో ముఖ్యమైన విషయం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఆగస్టులో పార్లమెంటరీ చట్ట సవరణ ద్వారా ఎండీఆర్‌కు మార్గం సుగమం చేసినప్పుడు, 'ప్రజలపై చార్జీలు ఉండవు, పరిమిత సంఖ్యలో వ్యాపారి లావాదేవీలపైనే నామమాత్రపు ఎండీఆర్' అని స్పష్టం చేసింది. యూపీఐ వ్యవస్థను సైబర్ భద్రత, మౌలిక సదుపాయాలు, సాంకేతిక అభివృద్ధి కోసం దీర్ఘకాలికంగా ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడమే ఉద్దేశమని ప్రభుత్వం తెలిపింది. అయితే ఒక విషయం మాత్రం స్పష్టంగా చర్చించాలి. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించాల్సిన బాధ్యతను కేవలం వినియోగదారులు, వ్యాపారులపై రుసుముల రూపంలో మోపడం ఎంతవరకు సరైనది? యూపీఐని ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన వ్యవస్థకు అవసరమైన మౌలిక సదుపాయాల వ్యయాన్ని ప్రభుత్వం, బ్యాంకింగ్ వ్యవస్థ, చెల్లింపు సంస్థలు, వ్యాపారులు.. ఎవరు ఎంత మేర భరించాలి? దీనిపై పారదర్శకమైన లెక్కలు ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉంది. వ్యక్తి నుంచి వ్యక్తికి చేసే చెల్లింపులు ఎలాంటి మొత్తమైనా ఉచితంగానే ఉంటాయని కేంద్రం స్పష్టం చేసింది. వినియోగదారుడి నుంచి నేరుగా ఎండీఆర్ వసూలు చేయకూడదని కూడా పేర్కొంది. అయినా.. యూపీఐని 'ఉచిత డిజిటల్ చెల్లింపు విప్లవం'గా ప్రజల్లోకి తీసుకెళ్లిన తర్వాత దాని వాణిజ్య లావాదేవీలపై రుసుము విధించడం విధానపరమైన మార్పే. దీనిని చిన్న విషయంగా కొట్టిపారేయలేం. నగదు వినియోగాన్ని తగ్గించి డిజిటల్ చెల్లింపులను పెంచాలంటే, యూపీఐ వినియోగంలో ప్రజలకు ఎలాంటి అనిశ్చితి కలగకుండా చూడాలి. ప్రభుత్వం చెప్పినట్టుగానే ఎండీఆర్ భారం వ్యాపారులకే పరిమితమవుతుందా? లేక కాలక్రమంలో దాని ప్రభావం వస్తువులు, సేవల ధరల్లో కనిపిస్తుందా? చిన్న వ్యాపారులకు ఇచ్చిన మినహాయింపులు ఆచరణలో ఎంతవరకు ఉపయోగపడతాయి? డిజిటల్ చెల్లింపులపై నమ్మకం దెబ్బతినకుండా ప్రభుత్వం ఎలాంటి రక్షణ చర్యలు తీసుకుంటుంది? ఈ ప్రశ్నలకు సమాధానాలు రాబోయే రోజుల్లో కీలకం. యూపీఐ అనేది కేవలం ఒక చెల్లింపు విధానం కాదు. కోట్లాది భారతీయుల రోజువారీ ఆర్థిక కార్యకలాపాల్లో భాగమైన మౌలిక వ్యవస్థ. అందుకే దాని విషయంలో తీసుకునే ప్రతి నిర్ణయం 'చార్జీ ఎవరిపై?' అనే ఒక్క ప్రశ్నతో కాకుండా.. 'దాని తుది ప్రభావం ఎవరిపై పడుతుంది?' అనే ప్రశ్నతోనూ కొలవాల్సిన అవసరం ఉంది.

## యూపీఐలో మార్పులు ఇలా..

- రూ.2,000కు మించిన కొన్ని యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) అమలు.
- వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే పీ2ఎం లావాదేవీలకు 0.4 శాతం ఎండీఆర్.
- ఒక్కో లావాదేవీపై ఎండీఆర్ గరిష్ఠంగా రూ.300 వసూలు. (ఉదాహరణకు రూ.2,000కు 0.4 శాతం = రూ.8)
- వ్యక్తి నుంచి వ్యక్తికి చేసే యూపీఐ చెల్లింపులకు ఎండీఆర్ లేదు.
- రూ.2,000లోపు పీ2ఎం లావాదేవీలకు కూడా ఎండీఆర్ లేదు.
- ప్రస్తుతం పీ2ఎం లావాదేవీల్లో 95 శాతానికి పైగా రూ.2,000లోపే ఉన్నాయని ఎన్‌పీసీఐ తెలిపింది.
- పీ2పీఎం కేటగిరీ చిన్న వ్యాపారులకు జీరో ఎండీఆర్ కొనసాగుతుంది.
- యూపీఐ క్యూఆర్ ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాలో నెలకు రూ.1 లక్ష వరకు చెల్లింపులు స్వీకరించే చిన్న విక్రేతలకు ఈ సౌకర్యం వర్తిస్తుంది.ఖ

# మనిషిపై.. 'ఏఐ' బాంబ్

**మొదటి పేజీ తరువాయి**

వినియోగానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మైక్రోసాఫ్ట్ తాజాగా రూపొందించిన ఏఐ ప్రవర్తనా నియమావళిలోనూ మానవ ఆదేశాలను అంగీకరించడం, సరిదిద్దితే మారడం, నిలిపివేయమంటే ఆగిపోవడం వంటి అంశాలను ప్రధాన సూత్రాలుగా ప్రతిపాదించింది. అంతేకాదు.. ఏఐ శక్తి కొద్దిమంది టెక్నాలజీ సంస్థల చేతుల్లో మాత్రమే కేంద్రీకృతం కాకూడదన్న చర్చ కూడా వేడెక్కుతోంది. భారీ డేటా కేంద్రాలు, విద్యుత్ వినియోగం, కంప్యూటింగ్ వనరుల కోసం పెరుగుతున్న పెట్టుబడులకు ప్రతిఫలంగా సమాజానికి నిజమైన ప్రయోజనం దక్కాలన్న వాదన బలపడుతోంది.

### 'నైతిక' బాధ్యతతో రాజీనామాలు

అత్యంత కలవరపెట్టే అంశం ఏమిటంటే.. ఏఐ భద్రతను పరిశోధిస్తున్న కొందరు నిపుణులు తమ సంస్థలను వీడుతూ హెచ్చరికలు చేయడం. గూగుల్ డీప్‌మైండ్ ఏజీఐ భద్రతా బృందంలో పనిచేసిన బిలాల్ చుగ్తాయ్ ఈ నెల 14న సంస్థను వీడుతున్నట్లు ప్రకటించారు. ఏఐ మానవాళికి ప్రాణాంతక ప్రమాదాన్ని సృష్టించే అవకాశం ఉందని, దాన్ని నివారించడానికి మనకు సమయం తగ్గిపోతోందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత ఏఐ అభివృద్ధి వేగానికి అనుగుణంగా దాని భద్రత, నియంత్రణపై అవగాహన పెరగడం లేదని అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో గూగుల్ డీప్‌మైండ్ ఏజీఐ భద్రతా బృందంలో పనిచేసిన జోష్ ఎంగెల్స్ కూడా సంస్థను వీడి స్వతంత్ర ఏఐ భద్రతా పరిశోధనా సంస్థ 'మెట్ర్'లో చేరారు. వచ్చే ఐదేళ్లలో అత్యంత శక్తివంతమైన ఏఐ వ్యవస్థల వల్ల తీవ్రమైన నష్టం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రస్తుత ఏఐ వ్యవస్థలను మరింత శక్తివంతం చేసే 'స్వీయ మెరుగుదల' ప్రక్రియకు వెళ్లే ముందు భద్రతా ప్రమాణాలు తగినంతగా ఉన్నాయా? అనే ప్రశ్నకు సమాధానం కావాలని పేర్కొన్నారు. ఇది ఒక్క సంస్థకే పరిమితమైన పరిణామం కాదు. ఆంత్రోపిక్, ఓపెన్‌ఏఐ సహా పలు సంస్థల్లో ఏఐ భద్రత, అనుసరణ రంగాల్లో పనిచేసిన నిపుణులు సంస్థల నుంచి బయటకు వచ్చి స్వతంత్ర పరిశోధన వైపు మళ్లుతున్నారు. భవిష్యత్ ఏఐపై నిర్ణయాలు కేవలం దాన్ని తయారు చేస్తున్న సంస్థలే తీసుకోవాలా? లేక బయట నుంచి స్వతంత్రంగా పరిశీలించే వ్యవస్థ ఉండాలా? అన్న ప్రశ్న ఇక్కడే తలెత్తుతోంది.

### 'పరీక్ష'లోనే నియంత్రణ దాటిన ఏఐ

ఏఐపై భయాలు కేవలం ఊహాగానాలేనని కొట్టిపారేయడానికి వీలులేని ఘటనలు ఇప్పటికే చోటుచేసుకున్నాయి. 2026 జూలైలో ఓపెన్‌ఏఐ అంతర్గత సైబర్ భద్రతా పరీక్షల్లో ఉపయోగించిన ఏఐ నమూనాలు తమకు కేటాయించిన పరిమిత వాతావరణం నుంచి బయటకు వెళ్లి హగ్గింగ్ ఫేస్ వ్యవస్థల్లోకి చొరబడిన ఘటనను సంస్థ స్వయంగా వెల్లడించింది. పరీక్షా వాతావరణం నుంచి బయటకు వెళ్లేందుకు నమూనాలు అనూహ్య మార్గాలను ఉపయోగించాయి. అనంతరం ఓపెన్‌ఏఐ దీన్ని అత్యంత అసాధారణమైన సైబర్ ఘటనగా పేర్కొని, భద్రతా చర్యలను మరింత కఠినతరం చేసినట్లు తెలిపింది. స్వతంత్ర సంస్థలతోనూ ఈ ఘటనపై సమీక్ష జరిపించింది. ఇక్కడ కీలకమైన విషయం మరొకటి ఉంది. అత్యంత శక్తివంతమైన ఏఐ వ్యవస్థలను పరిమిత వాతావరణంలో ఉంచడం ఎంత కష్టమవుతోందో మాత్రం ఈ ఘటన స్పష్టం చేసింది. ఆంత్రోపిక్ కూడా జూలైలో తన 'క్లాడ్' నమూనాలకు సంబంధించిన మూడు ఘటనలను వెల్లడించింది. మూడుచోట్ల పరీక్షా వాతావరణాల నుంచి నమూనాలు ఇంటర్నెట్‌కు



చేరుకుని, వాస్తవ కంప్యూటర్ వ్యవస్థల్లో అనధికార చర్యలు చేపట్టినట్లు సంస్థ తెలిపింది. సెప్టెంబర్‌లో నిర్వహించిన విస్తృత సమీక్షలో ఇలాంటి మరో ఘటనను గుర్తించినట్లు వెల్లడించింది. ఈ ఘటనల్లో కొన్ని భద్రతా పరిమితులను ఉద్దేశపూర్వకంగా తొలగించి పరీక్షలు నిర్వహించిన సందర్భాలు కూడా ఉన్నాయని సంస్థ స్పష్టం చేసింది. అంటే.. ఇప్పటివరకు ఏఐ స్వయంగా ప్రపంచాన్ని స్వాధీనం చేసుకున్న పరిస్థితి రాలేదు. కానీ మనిషి ఇచ్చిన లక్ష్యాన్ని నెరవేర్చే క్రమంలో ఊహించని మార్గాలను అన్వేషించే సామర్థ్యం మాత్రం పెరుగుతోంది. భవిష్యత్తులో అదే సామర్థ్యం మరింత శక్తివంతమైన వ్యవస్థల్లోకి వెళితే ఏమవుతుంది? అన్నదే అసలు ప్రశ్న.

### 'స్వీయ మెరుగుదల'

ప్రస్తుతం ఏఐ పరిశోధనలో అత్యంత చర్చనీయాంశంగా మారిన భావన 'రీకర్సివ్ సెల్ఫ్ ఇంప్రూవ్‌మెంట్'. అంటే.. ఒక ఏఐ వ్యవస్థ తనకంటే మెరుగైన మరో వ్యవస్థను రూపొందించడంలో సహాయపడటం, ఆ వ్యవస్థ మరింత శక్తివంతమైన వ్యవస్థను రూపొందించడం వంటి చక్రం. ఇలాంటి ప్రక్రియ పూర్తిస్థాయిలో వాస్తవ ప్రపంచంలో స్వయంప్రతిపత్తితో జరుగుతున్నదని చెప్పడానికి ఇప్పటివరకు ఆధారాలు లేవు. అయితే కోడ్ రాయడం, పరిశోధన, సైబర్ భద్రత, సమస్య పరిష్కారం వంటి రంగాల్లో ఏఐ సామర్థ్యాలు వేగంగా పెరుగుతున్నాయి. అందుకే 'ఏఐ సామర్థ్యం పెరిగే వేగం'కు, 'దాన్ని నియంత్రించే పద్ధతులు మెరుగయ్యే వేగం'కు మధ్య అంతరం ఏర్పడకూడదన్న ఆందోళన పరిశోధకుల్లో పెరుగుతోంది. ఇక్కడే అసలు ప్రమాదం దాగి ఉండొచ్చన్నది భద్రతా నిపుణుల వాదన. మనిషి నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించడానికి ఏఐ ఎలాంటి మార్గాన్ని ఎంచుకుంటుంది? మనిషి ఊహించని పరిష్కారాన్ని ఎంచుకుంటే దాన్ని ముందుగానే గుర్తించగలమా? ఒక వ్యవస్థను నిలిపివేయమని ఆదేశించినప్పుడు అది నిజంగా ఆగుతుందా? ఇలాంటి ప్రశ్నలకు నమ్మకమైన సమాధానాలు లభించకముందే సామర్థ్యాన్ని మరింత పెంచడం ఎంతవరకు సురక్షితం అన్న చర్చ ప్రపంచవ్యాప్తంగా సాగుతోంది. ఏఐ మనిషికి శత్రువా? మిత్రుడా? అనే ప్రశ్నకు ఇప్పుడే తుది తీర్పు ఇవ్వలేం. ఎందుకంటే ఏఐ ఇంకా పరిణామ దశలోనే ఉంది. దాని వల్ల వైద్యం, విద్య, శాస్త్ర పరిశోధన, వ్యవసాయం, పరిశ్రమ, సైబర్ భద్రత వంటి రంగాల్లో అపారమైన ప్రయోజనాలు పొందే అవకాశాలు ఉన్నాయి. అదే సమయంలో తప్పుదోవ పట్టించే సమాచారం, సైబర్ దాడులు, గోప్యత ఉల్లంఘనలు, ఉద్యోగాల మార్పు, అధికారం కేంద్రీకరణ వంటి ప్రమాదాలూ ఉన్నాయి. అందుకే ఇప్పుడు ప్రపంచం ముందు ఉన్న అసలు ప్రశ్న 'ఏఐని ఆపాలా?' అనేది కాదు. 'ఏఐ ఎంత శక్తివంతమైనదైనా.. దాని తుది నియంత్రణ మనిషి చేతుల్లోనే ఉండేలా వ్యవస్థలను ఎలా నిర్మించాలి?' అనేదే. ఏఐ మనిషిని మించే మేధస్సును సృష్టించే దిశగా పరుగులు తీస్తుంటే.. దాన్ని నియంత్రించే మేధస్సు కూడా అంతే వేగంగా అభివృద్ధి చెందాలి. లేకపోతే మనిషి సృష్టించిన సాంకేతికతే ఒకరోజు మనిషి నిర్ణయాల కంటే వేగంగా నిర్ణయాలు తీసుకునే స్థితికి చేరుకునే ప్రమాదం ఉంది.

# 'కుట్టు మిషన్' దరఖాస్తుల గడువు పెంపు

**మొదటి పేజీ తరువాయి**

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. బీసీ మహిళలకు ఇంటి నుంచే స్వయం ఉపాధి పొందే అవకాశాలను కల్పించడం, వారి కుటుంబాల ఆదాయాన్ని పెంపొందించి ఆర్థికంగా స్వావలంబన సాధించేలా చేయడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. పథకానికి సంబంధించిన సమాచారం అర్హులైన ప్రతి మహిళకు చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించి, అర్హులైన వారందరూ గడువులోగా దరఖాస్తు చేసుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి సమీక్షా సమావేశంలో అధికారులను ఆదేశించారు.ద

# ఆళ్ల నాని హఠాన్మరణం

**మొదటి పేజీ తరువాయి**

గెలుపొందారు. 2013లో కాంగ్రెస్ కు గుడ్ బై చెప్పి వైసీపీలో చేరారు. 2017లో వైసీపీ తరపున ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2019లోనూ ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం డిప్యూటీ సీఎంగా.. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలను నిర్వహించారు. గత ఎన్నికల తర్వాత వైసీపీని వీడిన ఆయన 2025 ఏప్రిల్ లో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆళ్ల నాని మృతి పట్ల ఏపీకి చెందిన రాజకీయ నేతలు సంతాపం ప్రకటిస్తున్నారు. ఏలూరులో ఆయన భౌతికకాయాన్ని దర్శించుకునేందుకు అనుచరులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

# రోదసిలో రక్తపుటేర్లు!?

**మొదటి పేజీ తరువాయి**

కార్యదర్శి ట్రాయ్ మెయింక్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. అమెరికా సాయుధ బలగాలపై శత్రు దేశాల నుంచి ఎదురయ్యే ముప్పులను ఎదుర్కొనే సామర్థ్యాలను మరింత పెంచుతున్నామని చెప్పారు. ప్రస్తుతం కక్ష్యలోనే శత్రు చర్యలను ఎదుర్కోగల అంతరిక్ష ఆయుధాలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ ఆయుధాలు 'కైనెటిక్, నాన్-కైనెటిక్' విధానాల్లో పనిచేయగలవని స్పేస్ ఫోర్స్ తెలిపింది. అవసరాన్ని బట్టి రక్షణతో పాటు దాడి చర్యల్లోనూ వీటిని ఉపయోగించవచ్చని పేర్కొంది. అయితే అవి ఉపగ్రహాలను ధ్వంసం చేసే ఆయుధాలా, ఇతర రకాల వ్యవస్థలా అన్నదానిపై స్పష్టత ఇవ్వలేదు.

# ట్రంప్ మా పథకాలను కాపీ కొడుతున్నాడు: డీకే

**మొదటి పేజీ తరువాయి**

శివకుమార్ వ్యాఖ్యానించారు. బెంగళూరులో విలేకరులతో మాట్లాడిన ఆయన, తమ ప్రభుత్వ గ్యారెంటీ పథకాలు బ్లాక్‌బస్టర్ విజయం సాధించాయని అన్నారు. నవంబర్‌లో జరిగే అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల్లో రిపబ్లికన్లు గెలిచి కాంగ్రెస్‌లోని ప్రతినిధుల సభ, సెనెట్‌లపై ఆధిపత్యం సాధిస్తే ప్రతి వయోజన అమెరికన్‌కు 5,000 డాలర్ల చొప్పున 'డివిడెండ్' ఇస్తామని ట్రంప్ ప్రకటించడాన్ని డీకే శివకుమార్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. గతంలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, బీహార్ వంటి రాష్ట్రాలు తమ కర్ణాటక మోడల్‌ను అనుసరించాయని, ఇప్పుడు ప్రపంచంలోనే అగ్రరాజ్యమైన అమెరికా అధ్యక్షుడు కూడా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఇదే తరహా సంక్షేమ హామీలను ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ సిద్ధాంతాలకు, భారత రాజ్యాంగ విలువలకు దక్కిన అంతర్జాతీయ గుర్తింపు అని ఆయన అభివర్ణించారు.

# తెలుగు రాష్ట్రాలకు 5 లక్షల ఇళ్లు

**మొదటి పేజీ తరువాయి**

నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరే అవకాశం ఉంది. త్వరలో జిల్లాల వారీగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది. అర్హతలు, ఎంపిక విధానం, లబ్ధిదారుల జాబితాకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులు వెల్లడించనున్నారు. అర్హత ఉన్న కుటుంబాలు ప్రభుత్వ ప్రకటనలపై దృష్టి పెట్టాలని అధికారులు సూచిస్తున్నారు.

# న్యాయవ్యవస్థనూ విమర్శించొచ్చు: సీజేఐ

**మొదటి పేజీ తరువాయి**

కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ 8వ తరగతి సాంఘిక శాస్త్రం కొత్త పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలో అవినీతి'పై ఓ అధ్యాయాన్ని ప్రచురించడం ఇటీవలే తీవ్ర వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ వివాదాన్ని సీజేఐ ఈ సందర్భంగా ప్రస్తావించారు. 'న్యాయవ్యవస్థ ఒక సంస్థగా విమర్శలను వ్యతిరేకించదు.. వ్యతిరేకించలేదు కూడా' అని పునరుద్ఘాటించారు. న్యాయ వ్యవస్థ పనితీరుపై నిష్పక్షపాతమైన, సమాచారంతో కూడిన, నిర్మాణాత్మకమైన విమర్శలు ఎంతో అవసరమని నొక్కి చెప్పారు. వాటి ద్వారానే సంస్థాగత జవాబుదారీతనం, స్వీయ సంస్కరణలు సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం వేరు, ప్రజామోదం వేరు అని సీజేఐ తెలిపారు. ప్రజలు కోరుకున్న ఫలితాలు ఇవ్వడం ద్వారా విశ్వాసం లభించదని, ప్రక్రియలో నిష్పక్షపాతాన్ని పాటించడం ద్వారానే అది సాధ్యమవుతుందని తెలిపారు. తీర్పు సరైనదిగా ఉండటంతో పాటు, అది న్యాయంగా జరిగిందనే భావన ప్రజల్లో కలగాలని సీజేఐ పేర్కొన్నారు. న్యాయస్థానాలు 'పరిశీలనకు, ప్రశ్నలకు, అవసరమైన చోట విమర్శలకు సిద్ధంగా ఉండాలి' అని కూడా ఆయన నొక్కి చెప్పారు.

# సురేఖ బర్తరఫ్ బాధాకరమే.. కానీ!



**క్రమశిక్షణ ఉల్లంఘనతోనే ఏఐసీసీ చర్య.. హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవు... టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్**

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడం బాధాకరమేనని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. అయితే పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందుకే ఏఐసీసీ ఈ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. పార్టీ నిర్దేశించిన హద్దులు దాటితే ఎంతటివారిపైనైనా చర్యలు తప్పవని తేల్చిచెప్పారు. హైదరాబాద్‌లో మంగళవారం మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ పార్టీ అంతర్గత వ్యవహారాలు, ఇటీవలి పరిణామాలపై మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, తనకు మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని, పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. "పార్టీ క్రమశిక్షణే అత్యంత ప్రధానం. ఏఐసీసీ నిర్దేశించిన హద్దులు, పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీలో ఏమైనా సమస్యలు ఉంటే అంతర్గత వేదికలపై చర్చించుకోవాలని సూచించారు. విషయాలను బహిరంగంగా మాట్లాడి క్రమశిక్షణ ఉల్లంఘిస్తే అధిష్ఠానం ఉపేక్షించదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డితో కలిసి ప్రజా సంక్షేమం విస్తరణ, తెలంగాణలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. తమ మధ్య గ్యాప్ ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరారు. కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతోనే తెలంగాణలో పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. సాధారణ కార్యకర్తలకు సైతం పార్టీలో కీలక పదవులు దక్కుతున్నాయని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి ఒక్కరినీ గుర్తిస్తామని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నేతలు, కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు.



## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## తీవ్రస్థాయికి 22ఏ సమస్య: రఘునందన్ రావు

న్యూఢిల్లీ: తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితా భూముల సమస్య తీవ్ర రూపం దాల్చిందని, దీనివల్ల లక్షలాది మంది సామాన్య ప్రజలు రిజిస్ట్రేషన్లు కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో 22ఏ భూములపై స్పష్టమైన చారిత్రాత్మక నిర్ణయం వస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ అంశంపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కనీస సన్నాహాలు లేకుండా సభకు వచ్చి అరకొర సమాచారంతో సమాధానం దాటవేసే ప్రయత్నం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో కోటి ఎకరాలకు పైగా భూములను అడ్డగోలుగా 22ఏ జాబితాలో చేర్చిన అధికారులపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మంత్రి ప్రతిపాదిస్తున్నట్లు, ఇప్పటివరకు తొలగించామంటున్న 47,440 ఎకరాల వివరాలు ఏ గ్రామంలో ఎక్కడున్నాయో బహిర్గతం చేయాలని, మిగిలిన భూములపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ జడ్జితో కూడిన ప్రత్యేక కమిటీని నియమించి ధరణి, భూభారతి లొసుగుల వల్ల నష్టపోయిన పేదలకు న్యాయం చేయాలని రఘునందన్ రావు కోరారు. ప్రజా సమస్యలపై నిలదీస్తే బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ రేవంత్ సర్కార్ బురదజల్లే రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే మొదటి కేబినెట్ సమావేశంలోనే భూ సమస్యలకు పరిష్కారం చూపుతామని ఎంపీ స్పష్టం చేశారు.

## 850 కోట్ల మందిపై 58 యుద్ధాల ప్రభావం

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న యుద్ధాల కారణంగా నిత్యావసర వస్తువులు, ఇంధన ధరలు నియంత్రణ లేకుండా పెరిగిపోతుండటంపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ప్రపంచంలో జరిగిన వివిధ 58 యుద్ధాల ప్రభావం దాదాపు 200 దేశాలలోని 850 కోట్ల మంది ప్రజలపై తీవ్రంగా పడిందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ ఏడాది ఫిబ్రవరి చివరి నుంచి ప్రారంభమై ఆరు నెలలుగా కొనసాగుతున్న అమెరికా - ఇరాన్ సైనిక ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ దెబ్బతిని, సామాన్యుడికి నిత్యావసరాలు అందని ద్రాక్షగా మారాయని అన్నారు. మార్కెట్లో రూ. 100 ఉండే వస్తువుల ధరలు రూ. 200 నుండి రూ. 300 వరకు పెరిగాయని, లీటర్ పెట్రోల్, గ్యాస్ ధరలు 2 డాలర్ల నుండి ఏకంగా 4 నుండి 5 డాలర్లకు పైగా భారమయ్యాయని లెక్కలతో వివరించారు. ధనిక వర్గాలకు దీనివల్ల పెద్దగా ఇబ్బంది లేకపోయినప్పటికీ, సమాజంలో ఉన్న 90 శాతం పేద, మధ్యతరగతి ప్రజలు ఈ ద్రవ్యోల్బణంతో అల్లాడిపోతున్నారని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి నెలకొంటేనే ధరల నియంత్రణ సాధ్యమవుతుందని స్పష్టం చేసిన కేఏ పాల్, గ్లోబల్ పీస్ సాధన కోసం రాబోయే సెప్టెంబర్ 28న వాషింగ్టన్ డీసీలోని టైమ్స్ స్క్వేర్ వద్ద ప్రత్యేక ప్రశాంతతా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## కాంతి రాణా, విశాల్ గున్నీపై సస్పెన్షన్ ఎత్తివేత జీవో జారీ

విజయవాడ, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖలో తీవ్ర అలజడి రేపిన నటి కాదంబరి జెత్వానీ కేసు వివాదంలో సస్పెన్షన్‌కు గురైన సీనియర్ ఐపీఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉపశమనం అందించింది. సస్పెన్షన్‌లో ఉన్న ఐపీఎస్ అధికారులు కాంతి రాణా టాటా, విశాల్ గున్నీలపై ఉన్న సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేస్తూ ప్రభుత్వం ఈరోజు అధికారికంగా జీవోలు జారీ చేసింది. వీరిద్దరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలంటూ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామల రావు పేరిట ఉత్తర్వులు వెలువడ్డాయి. ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసు నమోదు, విచారణ క్రమంలో నిబంధనల ఉల్లంఘనలు జరిగాయనే ఆరోపణలతో 2024 సెప్టెంబర్‌లో కాంతి రాణా టాటా, విశాల్ గున్నీలపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న ఈ సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ తాజా జీవో జారీ కావడంతో ఇద్దరికీ పెద్ద ఊరట లభించినట్టయింది.

## కాంగ్రెస్ ఓటమి ఖాయం: కవిత

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పెట్టుకున్న ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి వచ్చిన దాఖలాలు లేవని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. వారిని చిన్నచూపు చూస్తూ నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగులను రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా చూస్తామని కవిత చెప్పారు. ఉద్యోగులను గౌరవించేలా, వారు సంతోషంగా పనిచేసేలా తమ ప్రభుత్వం విధానాలు రూపొందిస్తుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉపాధ్యాయులు ఉద్యోగం కన్నా ఉద్యమానికే ప్రాధాన్యం ఇచ్చి పోరాడారని కవిత గుర్తు చేశారు. రాష్ట్రంలో 630 మండలాలకు కేవలం ఎనిమిది మంది పర్మినెంట్ మండల విద్యాధికారులు (ఎంఈవోలు) ఉండటం విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఉచిత, నాణ్యమైన విద్య అందాలంటే బలమైన యంత్రాంగం అవసరమని అన్నారు.

## రేవంత్ స్కీంలోనే స్కాం అన్నీ వెలికి తీస్తాం

**వేటినీ వదిలిపెట్టం కేటీఆర్ వార్నింగ్**



న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): సీఎం రేవంత్ రెడ్డి ప్రతి స్కీమ్ వెనుక ఒక స్కామ్ ఉంది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల ముందు ఎస్సీ, ఎస్టీ భూములను రెగ్యులరైజ్ చేస్తామన్నారు. మూడేళ్ల తర్వాత ఇప్పుడు చేస్తున్నారంటే.. మతలబు ఉంది అని తెలిపారు. అన్నీ వెలుగులోకి వస్తాయి.. వేటిని వదిలిపెట్టబోం అని కేటీఆర్ హెచ్చరించారు. ఢిల్లీలో మంగళవారం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ప్రజల సొమ్ము దోచుకోవడానికే 22ఏ పేరిట, లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి, 30 శాతం కమీషన్ కోసం చేసే చిల్లర ప్రయత్నాలను మానుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. వేల కాలనీలు, ఇండ్లను నిషేధిత జాబితాలో పెట్టి, ప్రజలను ఇబ్బంది పెట్టినందుకు రేవంత్ ప్రభుత్వం ప్రజలకు తక్షణమే క్షమాపణ చెప్పాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేసీఆర్ ఇంటి మీదకు వేలమంది గూండాలను పంపించారు. మేము అక్కడికి వెళ్తుంటే మమ్మల్ని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌లో పెట్టారు. అక్కడికి కూడా మా మీదకు గూండాలను ఉసిగొల్పారు. నిన్న నా సిబ్బందిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి, పోలీస్ స్టేషన్‌లో వారి మీద కాంగ్రెస్ గూండాలతో దాడికి దిగారు అంటే.. ఈ రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంత చెత్తగా ఉన్నాయో అర్థం అవుతోంది అని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలకు చెందిన అసైన్డ్ భూములను రెగ్యులరైజ్ చేసి, వారికి యాజమాన్య హక్కులు కల్పిస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. అసైన్డ్ భూములకు పట్టాలిచ్చే పేరుతో ముందుగానే ఒప్పందాలు కుదుర్చుకున్నారనే అనుమానం కూడా ఉంది. రేవంత్ ప్రభుత్వం తీసుకొచ్చే ప్రతి పథకం వెనుక ఉన్న అక్రమాలు భవిష్యత్తులో బయటపడతాయి. రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుంది. తప్పు చేసిన వారిని ఎవ్వరినీ వదిలిపెట్టం అని కేటీఆర్ హెచ్చరించారు.

## మావోయిస్టు సభ్యురాలు నక్కా సుశీల రాణి లొంగుబాటు



నిజామాబాద్, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): దశాబ్దాలుగా వామపక్ష తీవ్రవాదంలో అత్యంత కీలక పాత్ర పోషించిన సీనియర్ నాయకురాలు, డివిజన్ కమిటీ సభ్యురాలు నక్కా సుశీల రాణి (అలియాస్ లత/లలిత/రేలా/జ్యోతి) లొంగిపోయారు. నిజామాబాద్ సీపీ సాయిచైతన్య ఎదుట ఆమె మంగళవారం అధికారికంగా లొంగిపోయారు. సుశీల సరెండర్‌తో మావోయిస్టుల పునర్నిర్మాణ సామర్థ్యం పూర్తిగా దెబ్బతిన్నదని, ఇది రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాద పతనానికి ముగింపు దశగా నిలిచిందని పోలీసులు అభివర్ణించారు. ఈ చారిత్రాత్మక పరిణామంతో 2026 సంవత్సరం తెలంగాణ పోలీసు శాఖ పోరాటంలో ఒక కీలక మలుపుగా మారింది. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ), గ్రేహౌండ్స్, జిల్లా పోలీసుల సమన్వయంతో సాగించిన వ్యూహాత్మక చర్యల వల్ల ఈ ఏడాది ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో మొత్తం 266 మంది అజ్ఞాత మావోలు హింసామార్గాన్ని వీడి లొంగిపోయారు. ఈ ఏడాది లొంగిపోయిన వారిలో ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులు, 12 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక ప్రాంతీయ కమిటీ సభ్యుడు, 25 మంది డివిజనల్ కమిటీ కార్యదర్శులు/సభ్యులు ఉన్నారని పోలీసులు తెలిపారు. వీరితో పాటు 94 మంది ఏరియా కమిటీ సభ్యులు, 131 మంది సాధారణ మావోయిస్టులు లొంగిపోవడంతో పార్టీ నెట్‌వర్క్ అగ్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు పూర్తిగా ఛిన్నాభిన్నమైందని వెల్లడించారు. ప్రస్తుతం తెలంగాణకు చెంది బయటి రాష్ట్రాల్లో పనిచేస్తున్న ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు (గణపతి), జడె రత్నబాయి (సుజాత), వార్త శేఖర్ (మంగు) అనే ముగ్గురు నేతలు మాత్రమే అజ్ఞాతంలో మిగిలారని పోలీసులు ధ్రువీకరించారు. సుశీల రాణి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ పూర్తిగా బలహీన పడిందని... అజ్ఞాతంలో ఉన్న మిగిలిన వారందరూ తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న లొంగుబాటు, పునరావాస విధానాన్ని ఉపయోగించుకుని సాధారణ జనజీవన స్రవంతిలో కలవాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

## అల్లు అర్జున్ మామపై కేసు



హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): సినీ నటుడు అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డిపై హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నగరంలోని ఐటీ కారిడార్ పరిధిలోని నానక్‌రామ్‌గూడలో గల ఒక భూవివాదానికి సంబంధించి ఆయనపై క్రిమినల్ ఫిర్యాదు దాఖలైంది. నానక్‌రామ్‌గూడలోని 'మంత్రి కాస్మోస్' ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. చంద్రశేఖర్ రెడ్డి మరికొందరితో కలిసి తమ భవన ప్రాంగణంలోకి అక్రమంగా ప్రవేశించారని వారు ఆరోపించారు. గేట్ల తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడటమే కాకుండా, అడ్డుకోబోయిన సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేసి బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్, ఫొటోలను ఒక పెన్ డ్రైవ్‌లో నిక్షిప్తం చేసి, గచ్చిబౌలి పోలీసులకు సాక్ష్యంగా అందజేశారు. చంద్రశేఖర్ రెడ్డితో పాటు ఆయన అనుచరులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. అంతేకాకుండా, ఈ ఫిర్యాదు ప్రతులను తెలంగాణ డీజీపీ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, మాదాపూర్ డీసీపీ, గచ్చిబౌలి ఏసీపీలకు సైతం పంపారు. ఐటీ కారిడార్‌లోని తమ ఉద్యోగులకు, నివాసితులకు రక్షణ కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఏపీలో 22న ఓటర్ల జాబితా

విజయవాడ, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తును వేగవంతం చేసింది. మున్సిపల్ ఎన్నికలను పూర్తి చేసే దిశగా కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తాజాగా 41 పట్టణ స్థానిక సంస్థలకు ఫోటో ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ పరిధిలో రాష్ట్రంలోని 12 మున్సిపల్ కార్పొరేషన్లు, 29 మున్సిపాలిటీలు మరియు నగర్ పంచాయతీలు ఉన్నాయి. ఈ సంస్థలన్నింటికీ ఓటర్ల జాబితాలను రూపొందించే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఎస్ఈసీ ఆదేశించింది. అసెంబ్లీ ఎన్నికల కోసం రూపొందించిన తాజా ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకుని ఈ జాబితాలను తయారు చేయనున్నారు. 2026 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా ఎస్ఈసీ నిర్ణయించింది. ఈ తేదీ నాటికి ఓటు హక్కు పొందిన వారి పేర్లతో జాబితాలను సిద్ధం చేస్తారు. ఈ ప్రక్రియను పూర్తి చేసి, తుది ఓటర్ల జాబితాలను ఈ నెల 22న ప్రచురించనున్నట్లు ఎన్నికల సంఘం తన నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొంది. ఇటీవలే మరో 59 మున్సిపాలిటీలలో ఓటర్ల జాబితాల తయారీకి కూడా ఎస్ఈసీ ఇదే తరహాలో నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. తాజా నోటిఫికేషన్‌తో ఎన్నికల నిర్వహణ ప్రక్రియ మరింత వేగం పుంజుకుంది. వరుస నోటిఫికేషన్ల నేపథ్యంలో త్వరలోనే రాష్ట్రంలో పురపాలక ఎన్నికల నగారా మోగనుందని స్పష్టమవుతోంది.

## ధ్వజారోహణంతో మొదలైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

**ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని ఎగురవేసిన వేదపండితులు... ఏపీ సర్కారు తరపున చంద్రబాబు పట్టువస్త్రాల సమర్పణ**



తిరుమల, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రం ధ్వజారోహణంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ రెండు ప్రధాన ఘట్టాలతో తిరుమల గిరులు గోవింద నామస్మరణతో మార్మోగాయి. బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచికగా, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారి సమక్షంలో పండితుల వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని ఎగురవేశారు. ఈ ధ్వజారోహణం ద్వారా సకల దేవతలను, అష్టదిక్పాలకులను, సకల జీవరాశులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం సంప్రదాయం. ఈ కార్యక్రమంతో తొమ్మిది రోజుల ఉత్సవాలకు వైభవంగా తెరలేచింది. మరోవైపు, ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించే సంప్రదాయాన్ని పాటించారు. సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు టీడీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన కుటుంబ సమేతంగా తిరుమలకు చేరుకున్నారు. సీఎం వెంట ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి, కుమారుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, కోడలు నారా బ్రహ్మణి ఉన్నారు. సంప్రదాయ వస్త్రధారణలో ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి, ముందుగా బేడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆ తర్వాత పట్టువస్త్రాలను తలపై ఉంచుకుని, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశించి స్వామివారికి వస్త్రాలు సమర్పించారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రికి అర్చకస్వాములు వేదాశీర్వచనం పలికి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పర్యటనలో చంద్రబాబు వెంట టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఇతర నేతలు, అధికారులు ఉన్నాయి. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ కూడా ఈ సందర్భంగా ఆలయంలో కనిపించారు.

## 'ఎర్రవల్లి పసుపు నీళ్లు'

**నిందితులను అరెస్ట్ చేయొద్దు: హైకోర్టు**




హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): ఎర్రవల్లి పసుపు నీళ్ల వివాదంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేయొద్దని ధర్మాసనం ఆదేశించింది. కేవలం నోటీసులు ఇచ్చి దర్యాప్తు కొనసాగించాలని పోలీసులకు స్పష్టం చేసింది. ఏడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్ల కింద కేసులు నమోదైనప్పుడు నిందితులను ఎలా అరెస్టు చేస్తారని హైకోర్టు ప్రశ్నించింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయని గుర్తుచేసింది. వాటిని పక్కనపెట్టి అరెస్టులకు ఎలా వెళతారని పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించవద్దని హెచ్చరించింది. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న ఎర్రవల్లి ప్రాంతంలో కాంగ్రెస్ నిర్వహించిన నిరసన కార్యక్రమం తర్వాత ఈ వివాదం మొదలైంది. నిరసన జరిగిన ప్రాంతాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలు పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. ఈ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ నేతలు, స్థానికుల ఫిర్యాదులతో పోలీసులు కేసు నమోదు చేశారు. వివిధ సెక్షన్ల కింద కేసులు పెట్టారు. నిందితులను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో వారిలో కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపిన ధర్మాసనం.. నిందితుల అరెస్టుపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. తదుపరి చర్యలను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని పోలీసులను ఆదేశించింది.

## పోలీసుల విచారణకు యూట్యూబర్ నందన

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): విదేశీ ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబర్ నందన, గడువు కంటే ఒకరోజు ముందే మరోసారి పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం అధికారులు ఆమెను విచారించారు. వాస్తవానికి, ఆమె సెప్టెంబర్ 16వ తేదీలోగా విచారణకు హాజరుకావాల్సి ఉండగా, ఒకరోజు ముందుగానే న్యాయవాదులతో కలిసి రావడం గమనార్హం. సుమారు మూడు గంటల పాటు కొనసాగిన ఈ విచారణలో పోలీసులు ఆమెకు 20 ప్రశ్నలు సంధించారు. కన్సల్టెన్సీ వ్యవహారాలన్నీ తన భర్త పర్యవేక్షించేవారని, ఆ లావాదేవీలతో తనకు ఎటువంటి సంబంధం లేదని ఆమె పోలీసులకు తెలిపినట్లు సమాచారం. తనపై జారీ చేసిన లుక్ అవుట్ నోటీసులను ఉపసంహరించుకోవాలని ఆమె ఈ సందర్భంగా పోలీసులను కోరారు. విచారణకు తాము పూర్తిస్థాయిలో సహకరిస్తామని ఆమె హామీ ఇవ్వగా, ఆ విన్నపాన్ని పరిశీలిస్తామని పోలీసులు వెల్లడించారు. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామనే నెపంతో నందన, ఆమె భర్త పలువురిని మోసం చేశారని ఆరోపణలు వెల్లువెత్తాయి.

# రైతులకు రాజన్న ప్రసాదంగా కోడెల పంపిణీ

**45 ఎకరాల్లో అధునాతన గోశాల : విప్ ఆది**

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన తిప్పాపూర్ గోశాలలోని కోడెలను సన్న, చిన్నకారు రైతులకు రాజన్న ప్రసాదంగా అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు కోడెలను అందజేశారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్నకు కోడె మొక్కు చెల్లించడం భక్తులకు విశిష్టమైన సంప్రదాయమన్నారు. గతంలో కోడెలను స్వచ్ఛంద సంస్థలకు అందించే సమయంలో పలు ఇబ్బందులు ఎదురయ్యాయని, ఈ నేపథ్యంలో నిరుపేదలు, సన్న, చిన్నకారు రైతులకు వాటిని అందించాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న నిరుపేదలు, సన్న, చిన్నకారు రైతులను ఎంపిక చేసి కోడెలను అందిస్తున్నట్లు వివరించారు.

**కోడెలను సంరక్షించాలి**

రైతులు కోడెలను రాజన్న ప్రసాదంగా భావించి తమ బిడ్డల మాదిరిగా సంరక్షించాలని ఆది శ్రీనివాస్ కోరారు. కోడెల సంరక్షణపై దేవాదాయ, పశుసంవర్ధక శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. కోడెలను అక్రమంగా తరలించడం, ఇతర మార్గాల్లో వినియోగించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భక్తులు స్వామివారికి పాలు మరవని కోడెలను సమర్పించవద్దని ఆది శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. చిన్న కోడెలను దూర ప్రాంతాల నుంచి తరలించడం వల్ల ఒత్తిడి, అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. జెర్సీ జాతి కోడెలను కూడా సమర్పించవద్దని, ఎదిగిన, ఆరోగ్యంగా ఉన్న దేశీ కోడెలను మాత్రమే సమర్పించాలని సూచించారు. కోడెలకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా టీకాలు, వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. నాణ్యమైన పోషకాహారం, దాణా అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

**45 ఎకరాల్లో గోశాల**

శ్రావణ మాసంలోని ఒక సోమవారం తొలిసారిగా 13 వేలకుపైగా కోడె మొక్కు టికెట్లు విక్రయించగా, వివిధ మొక్కుల టికెట్ల ద్వారా రూ.54 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్నపై భక్తులకు ఉన్న విశ్వాసానికి ఇది నిదర్శనమన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎంకేపల్లి వద్ద ఏర్పాటు చేస్తున్న అధునాతన గోశాల తరహాలో వేములవాడలోనూ గోశాలను



ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. వేములవాడ పరిధిలో 45 ఎకరాల స్థలాన్ని గుర్తించామని, పనులు త్వరితగతిన ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారని చెప్పారు. దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఒక పశువైద్యుడిని నియమించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అనారోగ్యానికి గురైన కోడెలను వేరుగా ఉంచి వైద్యం అందించేందుకు ఒక ఎకరం స్థలాన్ని వినియోగించనున్నట్లు వివరించారు. భక్తులు ఆలయంలో నిజమైన కోడెను సమర్పించాలనుకుంటే ఆలయ అధికారులను సంప్రదించి నిర్ణీత రుసుం చెల్లించి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ రాకేశ్, ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీఓ కేఎస్‌బీ కుమారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీధర్, తహసీల్దార్ జయంత్, పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

# చైతన్య డెయిరీలో తనిఖీలు

**పాల ప్యాకెట్‌లో గమ్ లాంటి పదార్థం!**

జగిత్యాల, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): జగిత్యాలలోని పలు పాల కేంద్రాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇటీవల చైతన్య డైరీ పాల ప్యాకెట్‌లో గమ్‌లాంటి పదార్థం కనిపించిందంటూ వినియోగదారు చేసిన ఫిర్యాదు నేపథ్యంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష ఆధ్వర్యంలో చైతన్య డైరీ ఫారంతో పాటు పలు పాల విక్రయ కేంద్రాల్లో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా వివిధ పాల డైరీలు, విక్రయ కేంద్రాల నుంచి అధికారులు పాల నమూనాలను సేకరించారు. వాటిని నాణ్యత, ప్రమాణాల పరీక్షల కోసం గుర్తింపు పొందిన ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్ నుంచి వచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. చైతన్య డైరీ పాలపై వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో ప్రత్యేకంగా నమూనాలు సేకరించినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు వెల్లడించారు. పాలలో నాణ్యతా ప్రమాణాల ఉల్లంఘన జరిగినట్లు పరీక్షల్లో తేలితే సంబంధిత సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అవసరమైతే సంస్థను సీజ్ చేసే చర్యలు కూడా చేపడతామని స్పష్టం చేశారు. పాల నాణ్యత




విషయంలో ఎలాంటి రాజీ ఉండదని ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పాల విక్రయాలు, తయారీ జరుగుతున్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**పాలపై ప్రశ్నిస్తే..**

**కులం పేరుతో దూషణలు?**

జగిత్యాల జిల్లా కేంద్రంలోని చైతన్య పాల కేంద్రంలో పాల కొనుగోలు విషయంలో వివాదం చోటుచేసుకుంది. పాలు కొనుగోలు చేసిన అనంతరం అవి గడ్డకట్టి ఫెవికాల్‌లా మారాయని షాప్ యజమానిని ప్రశ్నించగా.. తనను ఫోన్‌లో దుర్భాషలాడటంతో పాటు కులం పేరుతో దూషించారని వినియోగదారుడు దురుశెట్టి లక్ష్మణ్ ఆరోపించారు. ఇతర కులాలకు చెందిన వ్యక్తులు, జర్నలిస్టులను సైతం అవమానకరంగా మాట్లాడారని ఆయన ఆరోపించారు. ఈ ఘటనపై స్వర్ణకార సంఘం నాయకులు స్పందిస్తూ.. బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని కులం పేరుతో దూషించడం సరికాదన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి స్వర్ణకార సంఘం భవనం వద్దకు వచ్చి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కులం పేరుతో దూషించినట్లు వచ్చిన ఆరోపణలపై పోలీసులు విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు, సంఘం నాయకులు కోరారు. న్యాయం జరగకపోతే నిరాహార దీక్ష చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణకారుల ఐక్యతను చాటుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు మూగల మారుతి, ఉపాధ్యక్షుడు తొగిటి లక్ష్మీనారాయణ, జగిత్యాల పట్టణ అధ్యక్షుడు గన్నేరువరం బుచ్చయ్య, కార్యదర్శి సింహరాజు శ్రీధర్, కార్యవర్గ సభ్యులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.



# తొలి జీతం ఎములాడ రాజన్నకు

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): వేములవాడ నంది కమాన్ ప్రాంతానికి చెందిన లాండే నిహారిక తన తొలి జీతాన్ని స్వామివారి సేవకు అంకితం చేశారు. ఇటీవల ఉద్యోగం పొందిన ఆమె తన తొలి సంపాదనలో కొంత మొత్తాన్ని ఆలయ అభివృద్ధికి, అన్నదాన పథకానికి విరాళంగా అందించారు. ఆలయ అభివృద్ధి కోసం రూ.10,111, నిత్య అన్నదాన పథకానికి రూ.9 వేల చొప్పున మొత్తం రూ.19,111 నగదును ఆలయ ప్రోటోకాల్ కార్యాలయంలో ప్రజా సంబంధాల అధికారి పెరిక శ్రీనివాస్‌కు అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆమెకు ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. తొలి సంపాదనను దైవకార్యానికి, అన్నదానానికి వినియోగించిన నిహారిక పలువురికి ఆదర్శంగా నిలిచారని ఆలయ వర్గాలు ప్రశంసించాయి.

**రాజన్న గుడికి విరివిగా విరాళాలు**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి, విస్తరణ పనులకు పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన భూపతి వెంకటేశ్వర్లు–శ్రీలత దంపతులు రూ.50 వేలతో పాటు, మెట్‌పల్లికి చెందిన పిప్పెర లలిత–రాజేష్ దంపతులు రూ.25,011 విరాళంగా అందించారు. ఆలయ అభివృద్ధి నిధికి సంబంధించిన ఈ మొత్తాలను ఆలయ ప్రోటోకాల్ కార్యాలయంలో పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మకు దాతలు అందజేశారు. అనంతరం కుటుంబ సమేతంగా శ్రీ భీమేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# శ్రీనివాస్ కుటుంబానికి బొడిగ శోభ పరామర్శ

రామడుగు, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలం గోపాలరావుపేట గ్రామానికి చెందిన ఫైండ్ల శ్రీనివాస్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బోడిగ శోభ వారి కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు, మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ మార్కొండ కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పాలన గిరిజనులకు వరం: జీవన్ రెడ్డి

జగిత్యాల, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): గిరిజనులకు రిజర్వేషన్ 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన ఘనత తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి అన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇందిరా సహాని కేసులో 50 శాతానికి మించి రిజర్వేషన్ పెంచకూడదనే నిబంధన ఉన్నా, గిరిజన జనాభాకు అనుగుణంగా కేసీఆర్ ధైర్యంగా 10 శాతానికి పెంచారని, కేంద్రానికి నివేదిక పంపి, ఆమోదం రాకపోయినా అమలు చేశారని తెలిపారు. దీనివల్ల ఏటా వైద్య రంగంలో 440 మంది గిరిజనులు డాక్టర్ సీట్లు పొందుతున్నారని, ఆంధ్రాలో ఇప్పటికీ 6 శాతమే ఉందని అన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించి, గురుకులాలు, సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించారని గుర్తు



చేశారు. సెప్టెంబర్ 17న కేటీఆర్ పిలుపు మేరకు ప్రతి తండా, గూడెంలో కేసీఆర్‌కు క్షీరాభిషేకం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో దాడులు జరుగుతున్నాయని, పోలీస్ స్టేషన్‌లోనే కేటీఆర్ పీఆర్వోపై కాంగ్రెస్ గుండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇది పరోక్షంగా కేటీఆర్‌పై కుట్రపూరిత దాడేనని అన్నారు. దాడి చేసిన వారిపై తక్షణమే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ మాట్లాడుతూ కేసీఆర్ గిరిజనుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తే, ప్రస్తుత ప్రభుత్వం బడ్జెట్ కాగితాలకే పరిమితం చేస్తోందని, రేవంత్ రెడ్డి గుండా రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వేంకటేశ్వరరావు, కొల్ముల రమణ, దేవేందర్ నాయక్, వొల్లం మల్లేశం, బర్కం మల్లేశం, జున్ను రాజేందర్, తేలు రాజు, చందా రాధాకిషన్, సాయి, లచ్చవ్వ, సర్పంచ్ పొనగంటి మహేష్, శీలం సురేందర్, కల్లెపల్లి దుర్గయ్య, అబ్దుల్ బారి, ప్రవీణ్, నందు నాయక్, గుండా మధు, ధర్మయ్య, బానోత్ వసంత్, బానోత్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# సంకేపల్లిలో నూతన ఆటో యూనియన్



వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): వేములవాడ మండలం సంకేపల్లి గ్రామంలో నూతన ఆటో యూనియన్‌ను ఏర్పాటు చేసి, నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చింతపల్లి మోహన్‌రావు, అధ్యక్షుడిగా జింక మల్లేశం, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ షబ్బీర్ అలీ, కార్యదర్శిగా తీగల పరశురాము, కోశాధికారిగా పండగ నరసింహస్వామి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన యూనియన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సభ్యుల ఐక్యత, పరస్పర సహకారంతో ముందుకు సాగుతూ గ్రామ ప్రజలకు మెరుగైన ఆటో సేవలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన యూనియన్ నాయకులు, సభ్యులు డివిజన్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, రుద్రవరం ఆటో యూనియన్ అధ్యక్షుడు ఇల్లెందుల మల్లేశంను మర్యాదపూర్వకంగా కలిసి నూతన కార్యవర్గ వివరాలను తెలియజేసి సన్మానించారు. రుద్రవరం ఆటో యూనియన్ సభ్యులను కూడా సంకేపల్లి యూనియన్ సభ్యులు సత్కరించారు. ఆటో యూనియన్ల మధ్య స్నేహభావం, ఐక్యత, పరస్పర సహకారం మరింత బలోపేతం కావాలని నాయకులు ఆకాంక్షించారు. గ్రామ ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా సేవలు అందించడంతో పాటు ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేస్తామని తెలిపారు.

# కాంగ్రెస్ సర్కారు పేదల పక్షపాతి: సంజయ్

జగిత్యాల, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): పేదల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ అన్నారు. విద్యుత్ ప్రమాదాల్లో మృతి చెందిన ఇద్దరి కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల చొప్పున పరిహారాన్ని మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. తిప్పన్నపేట గ్రామానికి చెందిన చింతకుంట రాజా నర్సయ్య ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. ఆయన భార్య లక్ష్మికి ప్రభుత్వం విద్యుత్ శాఖ ద్వారా మంజూరు చేసిన రూ.50 వేల చెక్కు, రూ.4.50 లక్షల బాండ్‌ను ఎమ్మెల్యే అందజేశారు. అలాగే జగిత్యాల పట్టణంలోని బుడిగజంగాల కాలనీకి చెందిన సిరిగిరి ఎల్లవ్వ విద్యుత్ షాక్‌తో మృతి చెందగా, ఆమె భర్త వెంకటయ్యకు రూ.50 వేల చెక్కు, రూ.4.50 లక్షల చెక్కు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాల్లో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన పేదలకుఎ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పార్టీలు మారి ప్రభుత్వాన్ని



విమర్శించడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. ప్రజా సంక్షేమం, పేదల అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గజంగి నందయ్య, టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, కోఆప్షన్ సభ్యుడు గట్టు సతీష్, సమీండ్ల శ్రీనివాస్, అడువాల లక్ష్మణ్, బాలముకుందం, నక్కల రవీందర్‌రెడ్డి, రౌతు గంగాధర్, ములసపు మహేష్, లైశెట్టి విజయ్, గోపి శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దుమల రాజ్‌కుమార్, విద్యుత్ శాఖ ఏఈడీ జవహర్‌నాయక్, ఏఈలు ప్రవీణ్, సుందర్, గట్టు రాజు, తొలిప్రేమ శ్రీనివాస్, మహేష్, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# 44 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

కోరుట్ల, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తోందని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోరుట్ల పట్టణ, మండలానికి చెందిన లబ్ధిదారులకు రూ.8.50 లక్షల విలువైన 44 సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# కోటిలింగాలకు మహర్దశ

**రూ.5.50 కోట్లతో ఆలయ అభివృద్ధి.. శరవేగంగా పనులు ప్రారంభం**

వెల్గటూర్, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని వెల్గటూర్ మండలం కోటిలింగాలలోని శ్రీ పార్వతి కోటేశ్వర స్వామి దేవస్థాన అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. నూతన ఆలయ నిర్మాణానికి రూ.4.50 కోట్లు, రాజగోపురానికి రూ.1 కోటి నిధులు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా పాత ఆలయ శిఖరాలను యంత్రాల సహాయంతో తొలగించే పనులు చేపట్టారు. పుష్కరాల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో ఆలయాన్ని ఆధునికంగా తీర్చిదిద్దడంతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించనున్నారు. నిధులు మంజూరు చేయించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ఆలయ ఈఓ కాంతారెడ్డి, చైర్మన్ పుదరి రమేష్, ధర్మకర్తలు, అర్చకులు కృతజ్ఞతలు తెలిపారు.

# సీజ్ చేసిన ఇసుక వేలం

గంగాధర, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండల కేంద్రంలో పోలీసులు పట్టుకున్న ఇసుకను తహసీల్దార్ అంబాటి రజిత సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుకను రేపు బహిరంగ వేలం వేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. వేలంలో ఆసక్తి ఉన్న ఎవరైనా పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు. వేలానికి సంబంధించిన వివరాలను సంబంధిత అధికారుల వద్ద తెలుసుకోవాలని సూచించారు.





# మల్యాలలో రోబోటిక్ గణపతి ప్రత్యేక ఆకర్షణ

మల్యాల, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అయ్యప్పస్వామి రూపంలో కొలువుదీరిన గణనాథుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. అదేవిధంగా ఏర్పాటు చేసిన రోబోటిక్ గణపతి భక్తులకు వినూత్న అనుభూతిని కలిగిస్తోంది. మరో ప్రత్యేక ఆకర్షణగా రూ.10 నాణెం వేస్తే ఆకాశం నుంచి శివుడు కిందకు వచ్చి భక్తులకు దర్శనమిచ్చే విధంగా ఏర్పాటు చేసిన ప్రదర్శన అలరిస్తోంది. ఈ వినూత్న ఏర్పాట్లను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. త్రిశూల్ యూత్ సభ్యులు గత 14 ఏళ్లుగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠిస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రతి ఏడాది భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తూ, వినూత్న అలంకరణలు, ప్రత్యేక కార్యక్రమాలతో భక్తులను ఆకట్టుకుంటున్నారు.



# మట్టి వినాయకుల తయారీలో విద్యార్థుల ప్రతిభ

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్‌లో నిర్వహించిన మట్టి గణపతి విగ్రహాల తయారీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పదో తరగతికి చెందిన బి. వెన్నెల, ఎన్. సహస్ర మొదటి బహుమతి, సిహెచ్. రితీష్, సిహెచ్. నందదత్త రెండో బహుమతి, సిహెచ్. నక్షత్ర, ఎం. భవాని మూడో బహుమతులు అందుకున్నారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులందరికీ పాఠశాల ప్రిన్సిపాల్ దరక్షన్ వస్పీయ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ నరాల దేవేందర్ మాట్లాడుతూ ఇటువంటి పోటీలతో విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలు పెంపొందుతాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలనే సందేశాన్ని విద్యార్థుల్లోకి తీసుకెళ్లేందుకు ఈ పోటీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆగస్టులో వాహనాల అమ్మకాల జోరు

**ప్యాసింజర్, టూ వీలర్లు, త్రీ వీలర్ల విభాగాల్లో భారీ వృద్ధి**

న్యూఢిల్లీ: భారత ఆటోమొబైల్ రంగం సరికొత్త రికార్డులతో దూసుకుపోతోంది. 2026 ఆగస్టు నెలలో ప్యాసింజర్ వాహనాలు, త్రీ వీలర్లు, టూ వీలర్ల హోల్‌సేల్ విక్రయాలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. గతేడాది ఇదే నెలతో పోలిస్తే అమ్మకాలు భారీగా పెరిగాయని 'సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మానుఫ్యాక్చరర్స్' (ఎస్ఐఏఎం) విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఎస్ఐఏఎం డేటా ప్రకారం.. ఆగస్టులో ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 4,39,309 యూనిట్లుగా నమోదయ్యాయి. గతేడాదితో పోలిస్తే ఇది 36.5 శాతం అధికం. అదేవిధంగా త్రీ వీలర్ల విక్రయాలు 22.8 శాతం వృద్ధితో 93,764 యూనిట్లకు, టూ వీలర్ల అమ్మకాలు 10.5 శాతం వృద్ధితో 20,34,698 యూనిట్లకు చేరాయి. ఆగస్టు నెలలో ఈ స్థాయి అమ్మకాలు నమోదు కావడం ఇదే ప్రథమం. ఈ రికార్డు స్థాయి వృద్ధిపై ఎస్ఐఏఎం డైరెక్టర్ జనరల్ రాజేశ్ మేనన్ మాట్లాడుతూ.. "భారత ఆటోమొబైల్ పరిశ్రమ ప్రస్తుతం పటిష్ఠమైన వృద్ధి దశలో ఉంది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే తక్కువ బేస్ ఉండటం, మార్కెట్లో బలమైన డిమాండ్ వాతావరణం నెలకొనడం ఈ వృద్ధికి దోహదపడ్డాయి" అని వివరించారు. వినియోగదారుల్లో పెరిగిన విశ్వాసం, గ్రామీణ మార్కెట్లలో స్థిరమైన డిమాండ్, మెరుగైన ఫైనాన్సింగ్ సదుపాయాలు వంటివి అన్ని కేటగిరీలలో అమ్మకాలు పెరిగేందుకు మద్దతుగా నిలుస్తున్నాయని ఆయన తెలిపారు. ప్రత్యామ్నాయ ఇంధనాలతో నడిచే వాహనాల వినియోగం పెరగడం కూడా పరిశ్రమకు సానుకూలంగా మారిందని పేర్కొన్నారు. రాబోయే పండుగ సీజన్‌తో అమ్మకాలు మరింత ఊపందుకుని, రెండో త్రైమాసికంలో మంచి ఫలితాలు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం ఆగస్టులోనే కాకుండా అంతకుముందు జులైలో కూడా ఆటోమొబైల్ అమ్మకాలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. జులైలో ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 34.3 శాతం వృద్ధితో 4,57,810 యూనిట్లుగా, టూ వీలర్ల



అమ్మకాలు 22.6 శాతం వృద్ధితో 19,23,483 యూనిట్లుగా, త్రీ వీలర్ల అమ్మకాలు 33.4 శాతం వృద్ధితో 92,560 యూనిట్లుగా నమోదయ్యాయి. వరుసగా రెండు నెలల పాటు అమ్మకాలు రికార్డు స్థాయిలో కొనసాగడం పరిశ్రమ పటిష్ఠతకు నిదర్శనంగా నిలుస్తోంది.

## విభిన్న అవతారాల్లో గణనాథుడు

జగిత్యాల, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. వివిధ గణేష్ మండళ్ల ఆధ్వర్యంలో గణనాథుడిని విభిన్న అవతారాల్లో అలంకరించడంతో భక్తులను ఆకట్టుకుంటున్నారు. భక్త మార్కండేయ దేవాలయంలో అయ్యప్ప స్వామి అవతారంలో, కృష్ణనగర్‌లో నరసింహస్వామి రూపంలో, అరవింద్‌నగర్‌లో కాశీ విశ్వనాథుడు, శ్రీకాళహస్తి పాతాళ గణపతి రూపాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. భక్తులు విభిన్న రూపాల్లో గణనాథుడిని చూసి తరించిపోతున్నారు.



## ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): వేములవాడ పట్టణ మున్నూరు కాపు కుల సంఘం ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన ఇంజనీర్లను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు, శ్రీ రాజరాజేశ్వరస్వామి ప్రసాదాలను అందజేశారు. సంఘం అధ్యక్షుడు కోయినేని బాలయ్య మాట్లాడుతూ ఇంజనీర్లు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రతి మనిషికి అవసరమైన గృహ నిర్మాణం నుంచి మౌలిక వసతుల అభివృద్ధి వరకు వారి సేవలు ఎంతో ముఖ్యమన్నారు. వేములవాడ పట్టణ మూడు సంఘాల అధ్యక్షుడు ఇప్పపుల అజయ్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణం ఎంతో శ్రమతో కూడుకున్నదని, అందులో సుతారి నుంచి ఇంజనీర్ వరకు అనేక మంది పాత్ర ఉంటుందని తెలిపారు. సీనియర్ ఇంజనీర్లు నరాల దేవేందర్, తోట దేవరాజు తమ సేవలను గుర్తించి సన్మానించినందుకు సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు నామాల పోశెట్టి, రాష్ట్ర ప్రతినిధి చిలుక రమేష్, ముఖ్య సలహాదారు నామాల రాజేశం, ప్రధాన కార్యదర్శి సోమినేని మహేష్, ఉపాధ్యక్షులు ఉప్పుల దేవరాజ్, జయరపు శ్రీధర్, మీడియా కన్వీనర్ చేకూర్తి నవీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## సాఫ్ట్‌బాల్‌లో శాత్రాజుపల్లి విద్యార్థుల ప్రతిభ

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 15 (ఈవార్తలు): వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాఫ్ట్‌బాల్ క్రీడలో ప్రతిభ కనబరిచారు. సబ్‌జూనియర్స్ బాలుర విభాగంలో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రదర్శనతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఆరుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. రాచర్ల వేణు, మొగిలి విష్ణు, గుడిసె ప్రవచన్, జిల్ల శివకుమార్, గుంటి మణిచరణ్, రెండుమిద్దెల శ్రీహర్ష మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని తిలక్ స్టేడియంలో ఈ నెల 11 నుంచి 13 వరకు జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. రాష్ట్రస్థాయిలో రాణించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై. శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం అభినందించింది. విద్యార్థులను తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయుడు లింగంపెల్లి రవిని ప్రత్యేకంగా ప్రశంసించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి పాఠశాలకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

## వడ్డీ రేట్లు పెంపు దిశగా ఆర్బీఐ

న్యూఢిల్లీ: ద్రవ్యోల్బణం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' (ఆర్‌బీఐ) వడ్డీ రేట్ల పెంపు సైకిల్‌ను ప్రారంభించే అవకాశం ఉందని సిస్టమాటిక్స్ గ్రూప్ నివేదిక పేర్కొంది. అక్టోబర్ తొలి వారంలో జరిగే ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశంలో ఇందుకు సంబంధించిన తొలి సంకేతాలు కనిపించొచ్చని తెలిపింది. ప్రస్తుతం 5.25 శాతంగా ఉన్న రెపో రేటు క్రమంగా 6.5 శాతానికి చేరే అవకాశముందని అంచనా వేసింది. ఆగస్టులో రిటైల్ ద్రవ్యోల్బణం 4.82 శాతానికి పెరిగింది. జులైలో ఇది 4.45 శాతంగా ఉంది. కొత్త సిరీస్‌లో ఇదే అత్యధిక స్థాయి. వరుసగా మూడో నెలలోనూ ఆర్‌బీఐ లక్ష్యంగా పెట్టుకున్న 4 శాతం మధ్యస్థ స్థాయిని దాటింది. ఆహార ద్రవ్యోల్బణం కూడా 5.95 శాతానికి చేరింది. జులైలో ఇది 5.52 శాతంగా నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆహార ధరల పెరుగుదల మరింత ఎక్కువగా ఉంది. అక్కడ ఆహార ద్రవ్యోల్బణం 6.13 శాతంగా ఉంది. హోల్‌సేల్ ధరల ద్రవ్యోల్బణం కూడా ఆగస్టులో 9.92 శాతానికి పెరిగింది. జులైలో ఇది 9.78 శాతంగా ఉంది. కూరగాయలు, సుగంధ ద్రవ్యాల ధరలు ప్రధాన ఒత్తిడిగా మారాయని నివేదిక తెలిపింది. ఇంధనం, ఇంధన ఆధారిత ఉత్పత్తుల ధరలు, తయారీ వ్యయాలు కూడా ధరల పెరుగుదలను విస్తృతం చేస్తున్నాయని పేర్కొంది. ద్రవ్యోల్బణం ఇదే వేగంతో కొనసాగితే అక్టోబర్-నవంబర్ నాటికి ఆరు శాతాన్ని దాటొచ్చని అంచనా వేసింది.

## ఒరాకిల్‌లో మళ్లీ లేఆఫ్స్

న్యూఢిల్లీ: ప్రముఖ టెక్ దిగ్గజం ఒరాకిల్ మరోసారి ఉద్యోగాల కోతకు దిగింది. సోమవారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో కొందరు ఉద్యోగులకు ఈ-మెయిల్స్ పంపి, వారిని విధుల్లోంచి తొలగిస్తున్నట్లు అకస్మాత్తుగా ప్రకటించింది. సంస్థాగత మార్పుల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామని మెయిల్స్‌లో స్పష్టం చేసింది. "ఒరాకిల్ ప్రస్తుత వ్యాపార అవసరాలను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత, సంస్థాగత మార్పుల్లో భాగంగా మీ పాత్రను తొలగించాలని నిర్ణయించాం. ఫలితంగా, ఈ రోజే మీ చివరి పనిదినం" అని ఆ ఈ-మెయిల్‌లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తొలగింపునకు గురైన ఉద్యోగులు తమ వ్యక్తిగత ఈ-మెయిల్ ఐడీలను అందించాలని, సెవరేన్స్ ప్యాకేజీ వివరాలను డాక్యుసైన్ ద్వారా పంపుతామని కంపెనీ సూచించింది. కొందరు ఉద్యోగులకు ఉదయాన్నే ఈ-మెయిల్స్ రాకముందే లాగిన్, స్లాక్ వంటి సిస్టమ్ యాక్సెస్ నిలిచిపోయినట్లు సమాచారం.

## నాలుగేళ్ల విద్యార్థి వీసా పరిమితిపై అమెరికా కోర్టు స్టే

**భారత విద్యార్థులకు ఉపశమనం..**

**ట్రంప్ నిర్ణయానికి బ్రేక్!**

వాషింగ్టన్: అమెరికాలో చదువుతున్న విదేశీ విద్యార్థులకు భారీ ఊరట లభించింది. అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను నాలుగేళ్లకే పరిమితం చేస్తూ ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన నిబంధన అమలును ఫెడరల్ కోర్టు తాత్కాలికంగా అడ్డుకుంది. ఈ నిర్ణయంతో అమెరికాలో చదువుతున్న వేలాది మంది భారతీయ విద్యార్థులకు కూడా ప్రయోజనం కలగనుంది. బోస్టన్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు న్యాయమూర్తి ఎఫ్. డెన్నిస్ సేలర్ సోమవారం దేశవ్యాప్తంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త నిబంధన మంగళవారం నుంచి అమల్లోకి రావాల్సి ఉండగా ఈ ఆదేశాలు వచ్చాయి. ఇప్పటివరకు విదేశీ విద్యార్థులు తమ కోర్సు కొనసాగుతున్నంతకాలం అమెరికాలో ఉండేందుకు అవకాశం ఉంది. కొత్త నిబంధన అమల్లోకి వస్తే నాలుగేళ్లకు మించి చదువు కొనసాగించాల్సిన వారు ఇమ్మిగ్రేషన్ అధికారుల అనుమతి తీసుకోవాల్సి వచ్చేది. కోర్సు మార్చడం, మరో విశ్వవిద్యాలయానికి మారడం, అదే స్థాయిలో మరో డిగ్రీ చేయడం కూడా అనుమతితోనే సాధ్యమయ్యేది. ప్రభుత్వం జాతీయ భద్రత కారణంగా నిబంధనల్లో మార్పులు అవసరమని వాదించింది. అయితే ప్రభుత్వం చెప్పిన కారణాలు బలహీనంగా ఉన్నాయని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. కొత్త నిబంధన అమలైతే అమెరికా విశ్వవిద్యాలయాలు, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా పీహెచ్‌డీ విద్యార్థులపై ప్రభావం ఎక్కువగా ఉండేదని కోర్టు పేర్కొంది. నేషనల్ సైన్స్ ఫౌండేషన్ గణాంకాల ప్రకారం అమెరికాలో డాక్టోరల్ కోర్సులు పూర్తయ్యేందుకు సుమారు 5.7 ఏళ్లు పడుతున్నాయి. విదేశీ విద్యార్థులు, పరిశోధకులపై పరిమితులు పెడితే అమెరికాకు నష్టం కలుగుతుందని కోర్టు అభిప్రాయపడింది. దాదాపు 22 వేల మంది కొత్త నిబంధనపై అభిప్రాయాలు పంపగా.. ఎక్కువ మంది వ్యతిరేకించారు. తదుపరి విచారణ అక్టోబర్ 2న జరగనుంది.

## ఏడుగురు అవామీ లీగ్ నేతలకు ఉరిశిక్ష

**హసీనా బంగ్లా ప్రయాణం ముంగిట షాక్**

ఢాకా: బంగ్లాదేశ్ రాజకీయంలో మరోసారి సంచలనాత్మక పరిణామాలు చోటుచేసుకున్నాయి. దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా వచ్చే డిసెంబర్‌లో భారత్ నుంచి తిరిగి బంగ్లాదేశ్‌కు వెళ్లనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో, అవామీ లీగ్ పక్షానికి అక్కడి అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ భారీ షాక్ ఇచ్చింది. 2024లో చోటుచేసుకున్న విద్యార్థుల పోరాటం, ఉద్యమ అణచివేత కేసులో మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై అవామీ లీగ్ జనరల్ సెక్రటరీ ఒబైదుల్ ఖాదర్‌తో సహా ఏడుగురు సీనియర్ నాయకులకు మరణశిక్ష ఖరారు చేస్తూ జస్టిస్ నజ్రుల్ ఇస్లామ్ చౌదరి నేతృత్వంలోని ట్రైబ్యునల్ మంగళవారం చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. 2024 జూలై-ఆగస్టు నెలల్లో దేశంలో హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన విద్యార్థుల ఉద్యమంపై విచక్షణారహితంగా దాడులు చేయించడం, హత్యలకు పురికొల్పడం, ప్రేరేపించడం వంటి తీవ్రమైన ఆరోపణలు రుజువు కావడంతో ఈ శిక్షలు విధించారు. గతంలోనే మాజీ ప్రధాని షేఖ్ హసీనాపై కూడా ఇదే ట్రైబ్యూనల్ మరణశిక్షను విధించిన సంగతి తెలిసిందే.

# ఆర్బీఐ రూ.3.93 లక్షల కోట్లు వెనక్కి

న్యూఢిల్లీ: బ్యాంకింగ్ వ్యవస్థలో పేరుకుపోయిన అదనపు ద్రవ్య లభ్యతను (లిక్విడిటీ) నియంత్రించేందుకు ఆర్‌బీఐ మరోసారి రంగంలోకి దిగింది. తాజాగా నిర్వహించిన 'వేరియబుల్ రేట్ రివర్స్ రెపో' (వీఆర్‌ఆర్‌ఆర్) వేలం ద్వారా రూ.3,93,352 కోట్లను ఆర్‌బీఐ వెనక్కి తీసుకుంది. బ్యాంకింగ్ వ్యవస్థలో అదనపు నిధులను తగ్గించి, మనీ మార్కెట్ రేట్లను రెపో రేటుకు అనుగుణంగా ఉంచడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టింది. ఈ వేలం కోసం ఆర్‌బీఐ రూ.5 లక్షల కోట్ల నోటిఫైడ్ మొత్తాన్ని ప్రకటించగా, బ్యాంకుల నుంచి రూ.3,93,352 కోట్ల విలువైన బిడ్లు దాఖలయ్యాయి. వచ్చిన బిడ్లన్నింటినీ ఆర్‌బీఐ ఆమోదించింది. ఈ నిధులను 5.24 శాతం కటాఫ్, వెయిటెడ్ యావరేజ్ రేటుతో స్వీకరించినట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. సెప్టెంబర్ 11 నాటికి బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత సుమారు రూ.10.73 లక్షల కోట్లుగా ఉన్నట్లు అంచనా.



బ్యాంకులు ఇటీవల భారీగా ఫారిన్ కరెన్సీ నాన్-రెసిడెంట్ (ఎఫ్‌సీఎన్‌ఆర్-బీ) డిపాజిట్లను సమీకరించడమే ఈ అదనపు నగదుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ డిపాజిట్ల ద్వారా వచ్చిన విదేశీ కరెన్సీని బ్యాంకులు ఆర్‌బీఐతో స్వాప్ చేసుకోవడంతో వాటికి పెద్ద మొత్తంలో రూపాయి ద్రవ్యం అందుబాటులోకి వచ్చింది. ఈ అదనపు నిధులను నియంత్రించేందుకు గత నెల నుంచి ఆర్‌బీఐ వరుసగా వీఆర్‌ఆర్‌ఆర్ వేలాలను నిర్వహిస్తోంది. వీఆర్‌ఆర్‌ఆర్ వేలంతో పాటు మరో కీలకమైన చర్యను కూడా ఆర్‌బీఐ ప్రకటించింది. అదనపు ద్రవ్యాన్ని మరింత సమర్థంగా నియంత్రించేందుకు ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ (ఓఎంఓ) కింద రూ.1 లక్ష కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీలను విక్రయించనుంది. మూడు విడతల్లో ఈ అమ్మకాలు జరగనున్నాయి. మొదటి విడతలో భాగంగా సెప్టెంబర్ 17న రూ.50,000 కోట్ల విలువైన సెక్యూరిటీలను విక్రయిస్తారు. ఆ తర్వాత సెప్టెంబర్ 21, 28 తేదీల్లో రూ.25,000 కోట్ల చొప్పున రెండు విడతల్లో వేలాలు జరుగుతాయి. ఇదే నెల ఆరంభంలో నిర్వహించిన ఓవర్ నైట్ వీఆర్‌ఆర్‌ఆర్ వేలంలో కూడా ఆర్‌బీఐ రూ.3.53 లక్షల కోట్లకు పైగా నిధులను సమీకరించింది.

**పిల్లలపై లైంగిక వేధింపులు..**

# దర్యాప్తు సంస్థల చేతికి కేసులు

**కేంద్ర ప్రభుత్వ ఒత్తిడితో తగ్గిన మెటా**

న్యూఢిల్లీ: సోషల్ మీడియా దిగ్గజం మెటా, భారత ప్రభుత్వంతో జరిపిన చర్చల అనంతరం కీలక నిర్ణయం తీసుకుంది. చిన్నారులపై జరిగే లైంగిక వేధింపులకు సంబంధించిన కేసుల వివరాలను నేరుగా భారత దర్యాప్తు సంస్థలకు నివేదించేందుకు అంగీకరించింది. ఆన్‌లైన్‌లో పిల్లల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం, ఈ విషయంలో ఎలాంటి రాజీకి తావులేదని సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లకు స్పష్టం చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. దేశంలో పనిచేస్తున్న ఏ ప్లాట్‌ఫామ్ అయినా సరే, పిల్లల భద్రతను ఒక ప్రాథమిక సూత్రంగా పాటించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. "మెటా సంస్థ చైల్డ్ సేఫ్టీకి సంబంధించిన విషయాలను సంబంధిత దర్యాప్తు సంస్థలకు నివేదించడానికి అంగీకరించింది. పిల్లలకు సురక్షితమైన ఆన్‌లైన్ వాతావరణాన్ని కల్పించే దిశగా ఇది ఒక తొలి అడుగు మాత్రమే, ఇంకా చేయాల్సింది చాలా ఉంది" అని ప్రభుత్వ వర్గాలు ఏఎన్ఐకి తెలిపాయి. చిన్నారులపై



లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్ (సీఎస్ఏఎం) సహా హానికరమైన విషయాలను గుర్తించి, వాటిని వెంటనే తొలగించాలని ప్రభుత్వం ఇతర ప్లాట్‌ఫారమ్‌లతో కూడా చర్చిస్తోంది. పిల్లల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోని ప్లాట్‌ఫారమ్‌లపై కఠిన చర్యలు ఉంటాయని ప్రభుత్వం ఇప్పటికే సంకేతాలు ఇచ్చింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వ అధికారులు మెటాతో పలు దఫాలుగా సమావేశమయ్యారు. మెటా ఉపయోగిస్తున్న అల్గారిథమ్స్, కంటెంట్ నియంత్రణ వ్యవస్థలు, డీప్‌ఫేక్ కంటెంట్‌ను అరికట్టే ప్రక్రియలు, భారత చట్టాలకు అనుగుణంగా తీసుకుంటున్న చర్యల గురించి అధికారులు వివరాలు కోరారు. కేవలం అమెరికా చట్టాల ప్రకారం నడుచుకుంటామంటే కుదరదని, భారత చట్టాలకు కట్టుబడి ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని సెక్షన్ 79 కింద లభించే 'సేఫ్ హార్బర్' రక్షణకు అర్హతపై కూడా అధికారులు ప్రశ్నలు లేవనెత్తారు. ఇప్పటివరకు మెటా, చిన్నారుల దోపిడీకి సంబంధించిన సమాచారాన్ని అమెరికాకు చెందిన 'నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్' (ఎన్‌సీఎంఈసీ)కి నివేదించేది. ఆ సంస్థ ప్రపంచవ్యాప్తంగా ఉన్న దర్యాప్తు సంస్థలతో సమన్వయం చేసుకుంటుంది. ఈ క్రమంలోనే 'పోక్సో' చట్టం కింద పనిచేసే భారత సైబర్ క్రైమ్ పోర్టల్‌కు సమాచారం చేరేది. అయితే, తాజా ఒప్పందంతో మెటా ఇకపై మధ్యవర్తి సంస్థల ప్రమేయం లేకుండా నేరుగా భారత ఏజెన్సీలకే రిపోర్ట్ చేస్తుంది.



# దేశానికి మీరేమిస్తారు?

**జెన్ జెడ్, జెన్ ఆల్ఫాకు నిర్మల క్వశ్చన్**

చెన్నై: దేశం నుంచి మనం ఏం ఆశించాలనే దానికంటే, దేశానికి మనం ఏం చేయగలమనే అంశంపైనే యువత ప్రధానంగా దృష్టి సారించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పిలుపునిచ్చారు. యువత ఆకాంక్షలను వినడానికి దేశం సిద్ధంగా ఉందని, అయితే అదే సమయంలో వారు తమ పౌర బాధ్యతలను కూడా చిత్తశుద్ధితో నిర్వర్తించాలని ఆమె సూచించారు. మంగళవారం చెన్నైలోని డాక్టర్ ఎంజీఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 36వ స్నాతకోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. "యువత నాయకత్వం బాధ్యతలు చేపట్టాలి. దేశ హితానికే ప్రథమ ప్రాధాన్యతనివ్వాలి. దేశం సురక్షితంగా, పటిష్ఠంగా ఉన్నప్పుడే మనకు నివసించడానికి ఒక ప్రశాంతమైన ఆవాసం ఉంటుంది. మన మాతృభూమిని ఎన్నటికీ వదులుకోకూడదు" అని నిర్మల సీతారామన్ పేర్కొన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్యంలో నెలకొన్న అశాంతి వంటి ప్రపంచ పరిణామాలను ప్రస్తావిస్తూ, దేశ భద్రత, స్థిరత్వం యొక్క ఆవశ్యకతను ఆమె ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకుంటూ 7.8 శాతం వృద్ధి రేటును సాధించిందని ఆమె కొనియాడారు. తమిళనాడు రాష్ట్రం పారిశ్రామిక, సాంకేతిక రంగాలలో హబ్‌గా విరాజిల్లుతోందని, ముఖ్యంగా శ్రీపెరంబుదూర్-ఒరగడమ్ కారిడార్ ఆటోమొబైల్, స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల అంతర్జాతీయ కేంద్రంగా నిలుస్తోందని తెలిపారు. కోయంబత్తూరు, మధురై వంటి నగరాల్లోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయని ఆమె వివరించారు. ఉద్యోగినులను ప్రోత్సహించేందుకు వీలుగా ప్రతి జిల్లాలో వర్కింగ్ విమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేసేందుకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులను కేటాయించినట్లు ఆమె గుర్తుచేశారు. ఈ సందర్భంగా 'తిరుక్కురళ్'లోని సూక్తులను ఉటంకిస్తూ, పట్టభద్రులు అహంకారాన్ని వీడి వినయంతో మెలగాలని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని ఆమె హితవు పలికారు.

## పాక్ మోసం.. ఇజ్రాయెల్ చెంతకు సౌదీ

**హౌతీలను ఎదుర్కొనేందుకు ఇజ్రాయెల్ నిఘా సాయం**

మక్కా: యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులను నిలువరించేందుకు సౌదీ అరేబియా అనూహ్య నిర్ణయం తీసుకుంది. దశాబ్దాలుగా శత్రుదేశంగా పరిగణిస్తున్న ఇజ్రాయెల్ నుంచి నిఘా సహకారాన్ని కోరినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. కీలక మిత్రదేశమైన పాకిస్థాన్ సైనిక సహాయం అందించేందుకు నిరాకరించడంతో, సౌదీ ఈ దిశగా అడుగులు వేసినట్లు తెలుస్తోంది. ఇటీవల యెమెన్‌లో హౌతీ (అన్సార్ అల్లా) మిలిటెంట్లు తమ దూకుడును మరింత పెంచారు. ఎర్ర సముద్ర తీరంలోని కీలక ప్రాంతాలతో పాటు, వ్యూహాత్మకంగా అత్యంత ప్రాముఖ్యత కలిగిన బాబ్ ఎల్-మాండెబ్ జలసంధిని వారు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అంతర్జాతీయ వాణిజ్యానికి ఇది అత్యంత కీలకమైన మార్గం కావడంతో, సౌదీ అరేబియా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో, సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ఇజ్రాయెల్ సహాయాన్ని కోరినట్లు సమాచారం. అమెరికా సెంట్రల్ కమాండ్ మధ్యవర్తిత్వంతో ఈ చర్చలు సాగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బాబ్ ఎల్-మాండెబ్ జలసంధి వద్ద పొంచి ఉన్న ముప్పుపై నిఘా సమాచారాన్ని పంచుకోవాలని సౌదీ పరోక్షంగా విజ్ఞప్తి చేసింది. వాస్తవానికి సౌదీ అరేబియా ఇజ్రాయెల్‌ను స్వతంత్ర దేశంగా గుర్తించదు, పైగా ఇరు దేశాల మధ్య ఎటువంటి అధికారిక దౌత్య సంబంధాలు లేవు. అయినప్పటికీ, ఇజ్రాయెల్ సాయం కోరడం యెమెన్‌లో సౌదీ ఎదుర్కొంటున్న సంక్షోభం తీవ్రతకు నిదర్శనంగా నిలుస్తోంది. అంతకుముందు, యెమెన్‌లో పోరాడేందుకు తమ సైన్యాన్ని పంపే ప్రతిపాదనను పాకిస్థాన్ తిరస్కరించింది. కేవలం సౌదీ భూభాగాన్ని రక్షించేందుకు మాత్రమే తమ బలగాలను వినియోగిస్తామని స్పష్టం చేసింది. మరోవైపు, అమెరికా, బ్రిటన్‌లు సైతం హౌతీలపై నేరుగా దాడులు చేసేందుకు విముఖత చూపుతూ, పరిమిత మద్దతుకే మొగ్గు చూపాయి. మిత్రదేశాలు నుంచి ఆశించిన స్థాయిలో సహకారం లభించకపోవడంతో, హౌతీలను నిలువరించేందుకు సౌదీ అరేబియా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఇందులో భాగంగానే ఈజిప్టుతో పాటు ఇతర గల్ఫ్ దేశాల సహాయాన్ని కూడా కోరినట్లు సమాచారం.

లవ్లీ చిత్రం



దిశా పటానీ

# ఆస్కార్ బరిలో 'ది డ్రాగన్ లెటర్'




లడఖ్‌కు చెందిన యువ ఫిల్మ్‌మేకర్ స్టాంజిన్ జిగ్మెట్ అంతర్జాతీయ వేదికపై సత్తా చాటాడు. ఆయన దర్శకత్వం వహించిన 'ది డ్రాగన్ లెటర్' అనే షార్ట్ ఫిల్మ్ ప్రతిష్ఠాత్మక 53వ స్టూడెంట్ అకాడమీ అవార్డుల్లో 'నరేటివ్' విభాగంలో స్వర్ణ పతకం గెలుచుకుంది. టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ సందర్భంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. హిమాలయాలలోని లడఖ్‌లోని మారుమూల ముల్బెఖ్ గ్రామానికి చెందిన స్టాంజిన్, స్పెయిన్‌లోని బార్సిలోనాలో ఫిల్మ్ డైరెక్షన్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశాడు. లడఖ్‌లో 'పిక్సెల్ ఛాలెంజర్ ఫిల్మ్స్' పేరుతో ఆయన ఒక ప్రొడక్షన్ హౌస్‌ను కూడా నడుపుతున్నాడు. ప్రపంచవ్యాప్తంగా 894 యూనివర్సిటీల నుంచి వచ్చిన 2,972 ఎంట్రీల నుంచి 'ది డ్రాగన్ లెటర్' ఎంపిక చేయడం విశేషం. ఈ విజయంపై జిగ్మెట్ ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందిస్తూ భావోద్వేగానికి గురయ్యాడు. "లడఖ్‌లోని ఓ మారుమూల గ్రామం నుంచి అకాడమీ అవార్డు వరకు సాగిన ఈ ప్రయాణం ఇప్పటికీ నమ్మశక్యంగా లేదు. ఈ పురస్కారం నా కుటుంబం, స్నేహితులు, నటీనటులు, సాంకేతిక బృందం, నా కథను నమ్మిన ప్రతి ఒక్కరికీ చెందుతుంది. మనం ఎక్కడి నుంచి వచ్చామనేది మన కథలు ఎంత దూరం ప్రయాణిస్తాయో నిర్ణయించలేదు" అని ఆయన రాసుకొచ్చాడు. ఇదే కేటగిరీలో కెనడాకు చెందిన 'ది పిచెనోట్' చిత్రానికి రజతం, పోలాండ్‌కు చెందిన 'కామాఠిపురా ఎక్స్‌ప్రెస్' చిత్రానికి కాంస్యం లభించాయి. స్టూడెంట్ అకాడమీ అవార్డు గెలుచుకున్న చిత్రాలన్నీ నేరుగా ఆస్కార్ అవార్డుల్లో లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ విభాగంలో పోటీ పడేందుకు అర్హత సాధిస్తాయి.

# వ్వన్.. తమన్నా 'శతాబ్దాల శక్తి'

సిద్ధార్థ్ మల్హోత్రా, తమన్నా భాటియా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'వ్వన్-ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్'. భారీ అంచనాల మధ్య సెప్టెంబర్ 25న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్న ఈచిత్రానికి సంబంధించిన ట్రైలర్ అప్డేట్ ఇ ఇచ్చింది మిల్క్ బ్యూటీ. 'శతాబ్దాలుగా




అందరూ ఎదురుచూస్తున్న ఆ శక్తి మేల్కొంటోంది' అంటూ వ్వన్ ట్రైలర్ బుధవారం రాబోతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు రిలీజ్ చేసిన పోస్టర్ ప్రజెంట్ వైరల్ అవుతుండగా.. వెయిటింగ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు. కాగా.. జానపద థ్రిల్లర్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి అరుణాభ్ కుమార్, దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వం వహిస్తుండగా.. బాలాజీ మోషన్ పిక్చర్స్ అండ్ ది వైరల్ ఫీవర్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

# 'కమలారెడ్డి'.. రమ్యకృష్ణ

మంచు మనోజ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'డేవిడ్ రెడ్డి'లో రమ్యకృష్ణ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆమె పోషిస్తున్న 'కమలా రెడ్డి' పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం మంగళవారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. రమ్యకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఈ పోస్టర్‌ను రిలీజ్ చేయడం విశేషం. పోస్టర్‌లో రమ్యకృష్ణ చాలా గంభీరంగా, పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. ఆమె పాత్ర సినిమాలో కీలకంగా ఉండబోతున్నట్లు లుక్ చూస్తే అర్థమవుతోంది. ఈ పోస్టర్‌ను మంచు మనోజ్ తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేశారు. రమ్యకృష్ణతో కలిసి నటించడం గౌరవంగా ఉందని పేర్కొన్నారు. ఆమె స్క్రీన్ ప్రెజెన్స్, పాత్రపై పట్టు అద్భుతమని ప్రశంసించారు. ఇప్పటికే ఈ సినిమాలో ఉక్రెయిన్ మోడల్, నటి మరియా రియాబోషప్కా 'క్లారా విట్‌మోర్'గా నటిస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ఆమె పాత్ర ప్రేమతో పాటు ప్రతీకారం, పోరాటంతో ముడిపడి ఉంటుందని చిత్రబృందం గతంలో తెలిపింది. 'డేవిడ్ రెడ్డి'కి హనుమా రెడ్డి యక్కంటి దర్శకత్వం వహిస్తున్నారు. వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. 1897 నుంచి 1922 మధ్య కాలంలో కథ సాగనుంది. చరిత్ర నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ డ్రామాలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు అంశాలు ఉండనున్నాయి. మంచు మనోజ్ సినీ ప్రయాణం 21 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గత ఏడాది ఆగస్టులో ఈ సినిమాను ప్రకటించారు. తన కెరీర్‌లో ఇది 21వ చిత్రమని అప్పట్లో వెల్లడించారు.




# ఎంఎస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌లో రష్మిక

స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న తన కెరీర్‌లోనే ఒక ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టును దక్కించుకున్నారు. దిగ్గజ కర్ణాటక సంగీత విద్వాంసురాలు, భారతరత్న ఎం.ఎస్. సుబ్బులక్ష్మి జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్న బయోపిక్‌లో ఆమె ప్రధాన పాత్ర పోషించనున్నట్లు అధికారికంగా ఖరారైంది. 'ఎం.ఎస్. – ఎ లెగసీ ఆన్ స్క్రీన్' అనే టైటిల్‌తో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. నటిగా రష్మిక కెరీర్‌లో ఇది ఒక మైలురాయిగా నిలిచిపోతుందని భావిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవాన్ని రేపు (సెప్టెంబర్ 16న) ఎం.ఎస్. సుబ్బులక్ష్మి 110వ జయంతిని పురస్కరించుకుని చెన్నైలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నటుడు కమల్ హాసన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా ఇండియన్ కోరల్ ఎన్‌సెంబుల్ బృందం, సుబ్బులక్ష్మి ఆలపించిన కొన్ని అజరామర గీతాలతో సంగీత నివాళి అర్పించనుంది. 'జెర్సీ' చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన గౌతమ్ తిన్ననూరి ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహిస్తుండగా, స్టార్ కంపోజర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. టాలీవుడ్ అగ్ర నిర్మాతలు అల్లు అరవింద్, బన్నీ వాస్‌లతో కలిసి ప్రముఖ నిర్మాత రాక్‌లైన్ వెంకటేశ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ పాత్ర కోసం చిత్రబృందం మొదట సాయి పల్లవి, రుక్మిణి వసంత్ వంటి నటీమణులను పరిశీలించింది. అయితే, ఇతర ప్రాజెక్టుల కారణంగా సాయి పల్లవి ఈ అవకాశం వదులుకున్నట్లు సమాచారం. అనంతరం నిర్వహించిన స్క్రీన్ టెస్టులో రష్మికను ఈ పాత్రకు ఎంపిక చేశారు.







# అనుకున్న సమయానికే కింగ్

బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ ప్రస్తుతం తన ప్రతిష్టాత్మక చిత్రం 'కింగ్'తో బిజీగా ఉన్నాడు. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న ఈ యాక్షన్ డ్రామాలో ఆయన కుమార్తె సుహానా ఖాన్‌తో పాటు దీపికా పదుకొణె, అభిషేక్ బచ్చన్, రాణి ముఖర్జీ కీలక పాత్రలలో అలరించనున్నారు. రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్, మార్వెల్స్ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం ఈ ఏడాది డిసెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు ఇప్పటికే అధికారిక ప్రకటన వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా ఓ పాడ్‌కాస్ట్ 'కింగ్' సినిమాకు సంబంధించి కొన్ని ముఖ్యమైన విషయాలను పంచుకున్నారు షారుఖ్. 'అనుకున్నట్లుగానే కింగ్ చిత్రం 2026 డిసెంబర్ 24న విడుదల కానుంది.

# ఆనంద్‌తో ప్రేమలో లేను



టాలీవుడ్ యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ వైష్ణవి చైతన్యలు రిలేషన్ లో ఉన్నారంటూ సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. బ్లాక్‌బస్టర్ చిత్రం 'బేబి'తో పాటు 'ఎపిక్'లో కలిసి నటించిన ఈ జోడీ రీల్ లైఫ్ కెమిస్ట్రీ చూసి, వీరిద్దరూ రియల్ లైఫ్ లోనూ ప్రేమలో ఉన్నారని, త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నారంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ డేటింగ్ రూమర్లపై తాజాగా ఒక ఇంటర్వ్యూలో స్పందించిన వైష్ణవి చైతన్య, తమ మధ్య ఎలాంటి రొమాంటిక్ రిలేషన్‌షిప్ లేదని తేల్చి చెప్పింది. తామిద్దరం మంచి కో-స్టార్స్ మాత్రమే కాకుండా ఆత్మీయ స్నేహితులమని తెలిపింది. ఇదే సమయంలో ఆనంద్ దేవరకొండ పెళ్లి ప్రణాళికల గురించి మాట్లాడుతూ... రాబోయే మూడేళ్లలో వివాహం చేసుకుంటానని చెప్పాడు. అయితే తనకు మాత్రం ఇప్పట్లో వివాహం ఆలోచన లేదని, కేవలం సినిమాలపైనే దృష్టి సారిస్తానని వైష్ణవి స్పష్టం చేసింది.

# శ్రీచరణి.. 800 పాయింట్లు

**భారత మహిళా క్రికెట్‌లో యువ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీచరణి సరికొత్త చరిత్ర సృష్టించింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తాజాగా విడుదల చేసిన టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో 800 రేటింగ్ పాయింట్ల మైలురాయిని దాటిన తొలి భారత బౌలర్‌గా ఈ తెలుగమ్మాయి అరుదైన ఘనతను అందుకుంది.**

మంగళవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో ఆమె 804 పాయింట్లతో అగ్రస్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. ఇప్పటివరకు ఏ భారత మహిళా క్రికెటర్ (బ్యాటింగ్ లేదా బౌలింగ్) కూడా ఈ ఘనతను సాధించలేదు.



2011లో భారత దిగ్గజ క్రికెటర్ మిథాలీ రాజ్ నెలకొల్పిన 780 పాయింట్ల అత్యుత్తమ రేటింగ్‌ను శ్రీచరణి ఇప్పుడు అధిగమించింది. ఇటీవల ముగిసిన ఆసియా కప్ 2026 ఫైనల్‌లో శ్రీలంకపై శ్రీచరణి అద్భుత ప్రదర్శన కనబరిచిన విషయం తెలిసిందే. ఆ మ్యాచ్‌లో కేవలం 20 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. టోర్నీ మొత్తం మీద 12 వికెట్లతో సత్తా చాటింది. ఈ ప్రదర్శనతో ఆమె రేటింగ్ పాయింట్లు భారీగా పెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా మహిళల టీ20 క్రికెట్‌లో 800 పాయింట్ల మార్క్ దాటిన మూడో బౌలర్‌గా ఆమె నిలిచింది. గతంలో ఇంగ్లండ్‌కు చెందిన సోఫీ ఎక్లెస్టోన్ (802), ఆస్ట్రేలియా పేసర్ మేగన్ షట్ (806) మాత్రమే ఈ ఘనత సాధించారు. ప్రస్తుతం మేగన్ షట్ పేరిట ఉన్న ఆల్-టైమ్ రికార్డుకు శ్రీచరణి కేవలం రెండు పాయింట్ల దూరంలో ఉంది. అంతేకాకుండా, ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక టీ20 వికెట్లు తీసిన భారత బౌలర్‌గా పూనమ్ యాదవ్ రికార్డును కూడా చరణి ఈ ఏడాది అధిగమించడం విశేషం. మరోవైపు, భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మ కూడా ర్యాంకింగ్స్‌లో సత్తా చాటింది. ఆసియా కప్‌లో 14 వికెట్లతో టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచిన దీప్తి, ఫైనల్‌లో 19 పరుగులకు 3 వికెట్లు తీసింది. ఈ ప్రదర్శనతో ఆమె నాలుగు స్థానాలు ఎగబాకి 729 పాయింట్లతో బౌలర్ల జాబితాలో రెండో స్థానానికి చేరుకుంది. భారత్ రికార్డు స్థాయిలో ఎనిమిదోసారి ఆసియా కప్ గెలవడంతో ఇతర క్రీడాకారిణుల ర్యాంకులు కూడా మెరుగయ్యాయి. ఫైనల్‌లో మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ (68) ఆడిన ఓపెనర్ షఫాలీ వర్మ, బ్యాటర్ల జాబితాలో ఒక స్థానం మెరుగుపరుచుకుని ఆరో ర్యాంకుకు చేరుకుంది. ఆల్‌రౌండర్ల జాబితాలోనూ ఐదు స్థానాలు ఎగబాకి 15వ స్థానంలో నిలిచింది.



## ఇమ్రాన్ ఖాన్ భార్య రెండో పెళ్లి

పాకిస్థాన్ మాజీ ప్రధాని, క్రికెట్ దిగ్గజం ఇమ్రాన్ ఖాన్ మాజీ భార్య, ప్రముఖ బ్రిటిష్ ఫిల్మ్ ప్రొడ్యూసర్ జెమీమా గోల్డ్‌స్మిత్ (52) తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. ఆమె ఐర్లాండ్‌కు చెందిన మల్టీ-మిలియనీర్ ఫైనాన్షియర్ కామెరాన్ ఓ'రైల్లీ (62)ని వివాహం చేసుకున్నారు. అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల మధ్య ఈ వివాహ వేడుక నిరాడంబరంగా, ప్రైవేట్‌గా జరిగింది. ఈ పెళ్లి విషయాన్ని జెమీమా సోదరుడు బెన్ గోల్డ్‌స్మిత్ భార్య, జెమీమా జోన్స్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అధికారికంగా ధ్రువీకరించారు. తన భర్తతో కలిసి పెళ్లి వేడుకకు హాజరైన ఫొటోను షేర్ చేస్తూ.. "జెమీమా, కామెరాన్‌ల పెళ్లిని సెలబ్రేట్ చేసుకుంటున్నాం. ఇది ఎంతో సంతోషకరమైన రోజు" అని ఆమె క్యాప్షన్ రాశారు.



# నితీశ్-సంజూ అదుర్స్

సిరీస్ భారత్ కైవసం

## టీమిండియాదే రెండో టీ20.. ఆఫ్ఘనిస్థాన్ ఓటమి

ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌ను భారత జట్టు మరో మ్యాచ్ మిగిలుండగానే కైవసం చేసుకుంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో మంగళవారం జరిగిన రెండో టీ20లో సమష్టి ప్రదర్శనతో అదరగొట్టిన టీమిండియా, 7 వికెట్ల తేడాతో ఆఫ్ఘన్‌పై ఘన విజయం సాధించింది.

**ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకుంది. తొలుత బౌలింగ్‌లో యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి, ఆపై బ్యాటింగ్‌లో ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ విధ్వంసంతో భారత్ విజయాన్ని సునాయాసం చేశారు. 160 పరుగుల లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు.**

ముఖ్యంగా సంజూ శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 22 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 57 పరుగులు చేసి అఫ్గాన్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అతనికి అభిషేక్ శర్మ (19 బంతుల్లో 39) తోడవడంతో పవర్‌ప్లేలోనే మ్యాచ్‌పై భారత్ పట్టు సాధించింది. వీరిద్దరూ తొలి వికెట్‌కు కేవలం 6.2 ఓవర్లలోనే 88 పరుగులు జోడించి విజయాన్ని ఖాయం చేశారు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ (38 నాటౌట్) నిలకడగా ఆడి లాంఛనాన్ని పూర్తి చేయడంతో, భారత్ 14.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. ఆఫ్ఘన్ బౌలర్లలో స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ ఒక్కడే 3 వికెట్లు పడగొట్టి కాస్త ఫర్వాలేదనిపించాడు. అంతకుముందు, టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘనిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్ (37), చివర్లో రషీద్ ఖాన్ (28) రాణించడంతో ఆఫ్ఘన్ ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. భారత బౌలర్లలో తెలుగు తేజం నితీశ్ కుమార్ రెడ్డి 3 వికెట్లతో అద్భుతంగా రాణించాడు. అర్ష్‌దీప్ సింగ్ రెండు వికెట్లు తీయగా, బుమ్రా, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్ తలో వికెట్ దక్కించుకున్నారు. సిరీస్ ఇప్పటికే కైవసం కావడంతో నామమాత్రమైన చివరి మ్యాచ్‌లోనూ గెలిచి క్లీన్‌స్వీప్‌పై టీమిండియా కన్నేసింది. ఈ సిరీస్ లో మూడో టీ20 ఎల్లుండి (సెప్టెంబరు 17) ఇదే మైదానంలో జరగనుంది.





## శ్రేయస్ వరల్డ్ రికార్డు

భారత టీ20 జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వరల్డ్ రికార్డు నెలకొల్పాడు. అంతర్జాతీయ టీ20 కెప్టెన్‌గా మొదటి 12 మ్యాచ్‌ల్లో అత్యధిక సార్లు (11) టాస్ గెలిచిన కెప్టెన్‌గా చరిత్ర సృష్టించాడు. ఆఫ్ఘనిస్తాన్‌తో రెండో టీ20లో టాస్ గెలవడంతో ఈ ఘనత సాధించాడు. ఖతార్ కెప్టెన్ మిర్జా బేగ్ (10), ఫిలిప్పీన్స్ కెప్టెన్ హెన్రీ టైలర్ (10)ను అధిగమించి సోలోగా ఈ రికార్డును సొంతం చేసుకున్నాడు. ఐసీసీ పూర్తి సభ్య దేశాల కెప్టెన్లను పరిశీలిస్తే.. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్, బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ మహ్మదుల్లా తమ తొలి 12 టీ20ల్లో తొమ్మిది సార్లు టాస్ గెలిచారు. శ్రేయస్ వీరికి అందనంత ఎత్తులో ఉన్నాడు. విరాట్ కోహ్లీ, లిటన్ దాస్, షై హోప్ వంటి ప్రముఖ కెప్టెన్లు తమ తొలి 12 టీ20ల్లో కేవలం రెండేసి టాస్ విజయాలు మాత్రమే సాధించి ఈ జాబితాలో అట్టడుగు స్థానాల్లో ఉన్నారు.



## సచిన్ రికార్డు బద్దలు



జింబాబ్వే వెటరన్ వికెట్ కీపర్ బ్యాటర్ బ్రెండన్ టేలర్ అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న సుదీర్ఘ వన్డే కెరీర్ రికార్డును టేలర్ బద్దలు కొట్టాడు. నేడు హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో బరిలోకి దిగడం ద్వారా ఈ ఘనత సాధించాడు. తద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లో తన పునరాగమనాన్ని చిరస్మరణీయం చేసుకున్నాడు. 2004లో వన్డే అరంగేట్రం చేసిన బ్రెండన్ టేలర్, తన కెరీర్‌ను 22 ఏళ్ల 146 రోజులకు విస్తరించాడు. దీంతో ప్రపంచంలోనే అత్యంత సుదీర్ఘకాలం వన్డేలు ఆడిన ఆటగాడిగా కొత్త చరిత్ర సృష్టించాడు. ఇప్పటివరకు ఈ రికార్డు సచిన్ టెండూల్కర్ (22 ఏళ్ల 91 రోజులు) పేరిట ఉండేది. టేలర్ కెరీర్ ఎన్నో ఎత్తుపల్లాలతో నిండి ఉంది. జింబాబ్వే తరఫున అత్యధిక పరుగులు చేసిన రెండో ఆటగాడిగా (6,704) కొనసాగుతున్న టేలర్, 2015 ప్రపంచకప్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికి ఇంగ్లండ్‌లో కోల్‌పాక్ ఒప్పందంపై ఆడాడు. రెండేళ్ల తర్వాత మళ్లీ జాతీయ జట్టులోకి తిరిగి వచ్చినా, 2021లో మరోసారి రిటైర్మెంట్ ప్రకటించాడు. ఆ తర్వాత 2019లో కొందరు బుకీలు తనకు కొకైన్ ఇచ్చి బ్లాక్‌మెయిల్ చేయడానికి ప్రయత్నించారని, ఆ విషయాన్ని ఐసీసీకి చెప్పడంలో ఆలస్యం చేసినందుకు మూడున్నరేళ్ల నిషేధానికి గురయ్యానని వెల్లడించి సంచలనం సృష్టించాడు. ఈ నిషేధం తర్వాత కోచింగ్‌పై దృష్టి పెట్టాలనుకున్న టేలర్‌ను జింబాబ్వే క్రికెట్ ఎండీ గివ్‌మోర్ మకోనీ ఒప్పించాడు.



## సిడ్నీ స్వీనీ.. న్యూడ్ షూట్!

ప్రముఖ అమెరికన్ నటి సిడ్నీ స్వీనీ నటించిన ఒక వాణిజ్య ప్రకటన ఇప్పుడు తీవ్ర వివాదాన్ని రాజేసింది. స్పోర్ట్స్ ప్రెడిక్షన్ ప్లాట్‌ఫామ్ అయిన 'నోవిగ్' కోసం రూపొందించిన ఈ యాడ్‌లో క్రీడల్లో మహిళలను లైంగిక వస్తువుగా, కించపరిచేలా చూపించారంటూ ప్రపంచవ్యాప్తంగా మహిళా అథ్లెట్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ యాడ్‌పై సోషల్ మీడియా వేదికగా విమర్శల వర్షం కురుస్తోంది. ఈ వివాదాస్పద యాడ్‌లో సిడ్నీ స్వీనీ దాదాపు దుస్తులు లేకుండా, ఫుట్‌బాల్స్, ఇతర క్రీడా పరికరాలతో శరీరాన్ని కప్పుకున్నట్లుగా కనిపించారు. దీనిపై నాలుగుసార్లు ఒలింపిక్ స్విమ్మింగ్ స్వర్ణ పతక విజేత, ఆస్ట్రేలియాకు చెందిన అరియార్న్ టిట్మస్ తీవ్రంగా స్పందించింది. "ఇది చూసి ఆగ్రహం కట్టలు తెంచుకుంది. మన సమాజం ఇప్పటికీ మహిళల శరీరాలను అడ్డుపెట్టుకుని డబ్బు సంపాదించడం, మహిళల క్రీడలను లైంగిక వస్తువులుగా చూపించడం ఆపలేదా?" అని ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రశ్నించింది. ఈ విమర్శలపై నోవిగ్ సంస్థ గానీ, సిడ్నీ స్వీనీ ప్రతినిధులు గానీ ఇంకా స్పందించలేదు. అయితే, వారాంతంలో సిడ్నీ స్వీనీ 'ఈఎస్‌పీఎన్ మ్యాగజైన్'కు చెందిన 'బాడీ ఇష్యూ' పాత కవర్ ఫొటోలను పోస్ట్ చేశారు.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# మోదీ సర్కారు తప్పటడుగులు

డిజిటల్ ఇండియా పేరుతో దేశాన్ని నగదు రహిత ఆర్థిక వ్యవస్థ వైపు నడిపిస్తున్నామని గొప్పలు చెప్పుకున్న మోదీ ప్రభుత్వం.. అదే డిజిటల్ విప్లవానికి వెన్నెముకగా మారిన యూపీఐపై ఇప్పుడు చార్జీలకు తలుపులు తెరవడం నిజంగా విధానపరమైన ముందడుగేనా? లేక ప్రజలను డిజిటల్ చెల్లింపులకు అలవాటు చేసిన తర్వాత క్రమంగా వాటిపై భారం మోపే తప్పటడుగా మారుతుందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటివరకు యూపీఐ అంటే వేగం, సౌలభ్యం, చార్జీ లేకపోవడం. టీ దుకాణం నుంచి పెద్ద దుకాణం వరకు, కూరగాయల బండి నుంచి ఆసుపత్రి వరకు.. చేతిలో నగదు లేకపోయినా మొబైల్ ద్వారా క్షణాల్లో చెల్లింపు చేయగలిగే వ్యవస్థగా యూపీఐ సామాన్యుడి జీవితంలో భాగమైంది. భారతదేశం ప్రపంచానికి చూపించిన అత్యంత విజయవంతమైన డిజిటల్ చెల్లింపు నమూనాల్లో యూపీఐ ఒకటిగా నిలిచింది. అలాంటి వ్యవస్థకు ఇప్పుడు వాణిజ్య లావాదేవీలపై రుసుముల మార్గాన్ని తెరవడం ఆందోళన కలిగించే పరిణామమే. సెప్టెంబర్ 14న కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం రూ.2,000 వరకు యూపీఐ లావాదేవీలపై బ్యాంకులు, చెల్లింపు వ్యవస్థలు నేరుగా లేదా పరోక్షంగా ఎలాంటి రుసుము విధించకూడదు. అయితే రూ.2,000కు మించిన లావాదేవీలకు మాత్రం రుసుము విధించే అవకాశం ఏర్పడింది. 2026 అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు మించిన వ్యక్తి-నుంచి-వ్యాపారి చెల్లింపులపై 0.4 శాతం వ్యాపారి రుసుము అమలు చేయనున్నట్లు ఎన్‌పీసీఐ ప్రకటించింది. రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలకు గరిష్ఠంగా రూ.300 పరిమితి ఉంటుంది. వ్యక్తి-నుంచి-వ్యక్తి లావాదేవీలు మాత్రం ఉచితంగానే కొనసాగుతాయి. ప్రభుత్వం మాత్రం ఇది వినియోగదారుడిపై నేరుగా పడే చార్జీ కాదని చెబుతోంది. చిన్న మొత్తాల లావాదేవీలు, వ్యక్తిగత లావాదేవీలు ఉచితంగానే ఉంటాయని స్పష్టం చేస్తోంది. యూపీఐ వ్యవస్థను నిర్వహించేందుకు, దాని మౌలిక వసతులు, సైబర్ భద్రత, మోసాల నివారణ, సాంకేతిక విస్తరణకు నిధులు అవసరమని ప్రభుత్వం వాదిస్తోంది. కానీ అసలు ప్రశ్న ఇక్కడే మొదలవుతుంది. చార్జీ వ్యాపారిపై పడినా దాని భారం చివరికి వినియోగదారుడిపై పడదనే హామీ ఏమిటి? వ్యాపారి చెల్లించే రుసుమును వస్తువుల ధరలో కలిపితే ఆ ఖర్చు ఎవరి జేబు నుంచి వెళ్తుంది? ఒక దుకాణదారు డిజిటల్ చెల్లింపులపై అదనపు వ్యయం భరించాల్సి వస్తే అతను నగదు చెల్లింపులను ప్రోత్సహించడమో, డిజిటల్ చెల్లింపులకు అదనపు ధర వసూలు చేయడమో చేయకుండా ఉంటాడని ఎలా చెప్పగలం? ఇది కేవలం 0.4 శాతం రుసుము సమస్య కాదు. ఒకసారి చార్జీకి తలుపు తెరిచిన తర్వాత దాని పరిధి భవిష్యత్తులో ఎంతవరకు విస్తరిస్తుందన్నదే అసలు భయం. ఈరోజు రూ.2,000 దాటిన వాణిజ్య లావాదేవీలు.. రేపు మరింత తక్కువ పరిమితికి వస్తాయా? ఈరోజు వ్యాపారిపై మాత్రమే ఉన్న రుసుము.. రేపు వినియోగదారుడి మీదకు వస్తుందా? ఈరోజు 0.4 శాతంగా ఉన్నది భవిష్యత్తులో పెరుగుతుందా? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు కావాలి. ఇక్కడే మోదీ ప్రభుత్వ విధానంపై విమర్శలు తప్పవు. యూపీఐని ప్రజల్లోకి తీసుకెళ్లింది ప్రభుత్వం. నగదు రహిత ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించింది ప్రభుత్వం. చిన్న వ్యాపారులు, చిరు దుకాణదారులు, వీధి వ్యాపారులు కూడా డిజిటల్ చెల్లింపులను స్వీకరించేలా చేసింది ప్రభుత్వం. ఇప్పుడు ఆ వ్యవస్థలో భారీ స్థాయిలో లావాదేవీలు జరుగుతున్న తర్వాత దానిని ఆదాయ వనరుగా మార్చే ఆలోచన మొదలైతే.. అది డిజిటల్ ఇండియా లక్ష్యానికే విరుద్ధమైన సంకేతం కాదా? 2025-26లో రూ.2,000కు మించిన వ్యక్తి-నుంచి-వ్యాపారి యూపీఐ చెల్లింపులు మొత్తం లావాదేవీల్లో కేవలం 4 శాతం మాత్రమే అయినప్పటికీ, విలువ పరంగా అవి దాదాపు మూడింట రెండొంతుల వాటాను కలిగి ఉన్నాయి. అంటే పెద్ద మొత్తాల డిజిటల్ వాణిజ్య చెల్లింపులపైనే కొత్త రుసుము ప్రభావం పడనుంది.

# ఏఐ.. మనిషిని మింగేస్తుందా..!?

21వ శతాబ్దంలో మానవ నాగరికతను అత్యంత వేగంగా మార్చుతున్న సాంకేతిక విప్లవాల్లో కృత్రిమ మేధస్సు ఒకటి. ఒకప్పుడు మనిషి మాత్రమే చేయగలడని భావించిన ఆలోచన, విశ్లేషణ, రచన, అనువాదం, పరిశోధన, వైద్య నిర్ధారణ వంటి అనేక పనులను నేడు యంత్రాలు నిర్వహిస్తున్నాయి. మాట్లాడే కంప్యూటర్లు, స్వయంగా నేర్చుకునే వ్యవస్థలు, స్వయంచాలక యంత్రాలు ఒకప్పుడు సైన్స్ ఫిక్షన్‌గా కనిపించేవి. ఇప్పుడు అవే మన రోజువారీ జీవితంలో భాగమయ్యాయి. ఏఐ మానవాళికి అపారమైన ప్రయోజనాలను అందించే శక్తి కలిగినప్పటికీ, నియంత్రణ లేకుండా అభివృద్ధి చెందితే తీవ్రమైన ప్రమాదాలకు కారణమవుతుందనే హెచ్చరికలు ప్రపంచవ్యాప్తంగా వినిపిస్తున్నాయి. ఏఐ స్వతహాగా మంచిది కాదు, చెడ్డది కాదు. దానిని ఎవరు, ఏ ఉద్దేశంతో, ఎలాంటి పరిమితులతో ఉపయోగిస్తున్నారన్నదే దాని ప్రభావాన్ని నిర్ణయిస్తుంది. అణుశక్తిని విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగించవచ్చు. అదే శక్తి వినాశకర ఆయుధంగా కూడా మారవచ్చు.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం



ఏఐ కూడా అంతే. వైద్య రంగంలో ప్రాణాలను కాపాడగలదు. వ్యవసాయంలో రైతులకు సరైన సూచనలు ఇవ్వగలదు. ప్రకృతి వైపరీత్యాలను ముందుగానే అంచనా వేయగలదు. విద్యను మరింత అందుబాటులోకి తీసుకురాగలదు. కానీ నేరగాళ్లు, అరాచక శక్తులు, ఉగ్రవాదులు లేదా బాధ్యతారహిత సంస్థల చేతుల్లో పడితే ఊహించని స్థాయిలో నష్టం కలిగించగలదు. అన్నింటికంటే ముఖ్యమైన ప్రశ్న ఏఐ స్వయంప్రతిపత్తి పెరుగుదల. సమాచారం అందించడం ఒక విషయం. దానిని విశ్లేషించి నిర్ణయం తీసుకోవడం మరో విషయం. తన లక్ష్యాన్ని సాధించేందుకు స్వయంగా ప్రణాళిక రూపొందించడం, అవసరమైన సమాచారాన్ని సేకరించడం, ఇతర డిజిటల్ వ్యవస్థలను ఉపయోగించడం, తన పనితీరును మెరుగుపరుచుకోవడం వంటి సామర్థ్యాలు పెరుగుతున్న కొద్దీ మానవ నియంత్రణకు సంబంధించిన ప్రశ్నలు మరింత తీవ్రమవుతాయి. ఒక యంత్రం మనిషి ఇచ్చిన ఆదేశాన్ని అమలు చేయడం వరకు సమస్య పరిమితంగానే ఉంటుంది. కానీ లక్ష్యాన్ని సాధించే మార్గాలను కూడా యంత్రమే నిర్ణయించే స్థాయికి చేరితే పరిస్థితి భిన్నంగా ఉంటుంది.

మానవ నిర్ణయం కేవలం సమాచారంపై ఆధారపడదు. అనుభవం, కరుణ, నైతికత, సామాజిక బాధ్యత, మానవ సంబంధాలు వంటి అంశాలు కూడా ప్రభావం చూపుతాయి. ఒక ఏఐ వ్యవస్థకు "ఎక్కువ లాభం సాధించు" అనే లక్ష్యాన్ని ఇవ్వడం సులభమే. కానీ అదే సమయంలో మానవ హక్కులు ఉల్లంఘించకూడదు, గోప్యతకు భంగం కలగకూడదు, సామాజిక అసమానతలు పెరగకూడదు, ఎవరికీ అన్యాయం జరగకూడదు వంటి విలువలను పూర్తిగా యంత్రానికి నేర్పడం అత్యంత క్లిష్టమైన పని. అందుకే ఏఐ నిర్ణయాల్లో మానవ బాధ్యత కొనసాగడం అవసరం. ఏఐ ఇప్పటికే సృష్టిస్తున్న మరో పెద్ద సమస్య తప్పుడు సమాచారం. డీప్‌ఫేక్ సాంకేతికతతో ఒక వ్యక్తి మాట్లాడని మాటలను మాట్లాడినట్లుగా చూపించడం, చేయని పనిని చేసినట్లుగా వీడియోలు రూపొందించడం, నకిలీ చిత్రాలు, స్వరాలను సృష్టించడం సులభమవుతోంది. ఎన్నికల సమయంలో తప్పుడు ప్రచారం చేయడం, రాజకీయ నాయకుల పేరుతో నకిలీ వీడియోలు సృష్టించడం, సామాజిక ఉద్రిక్తతలను పెంచడం వంటి చర్యలు ప్రజాస్వామ్య వ్యవస్థలకు సవాలుగా మారవచ్చు. ప్రజాస్వామ్యం నిజమైన సమాచారంపై ఆధారపడి ఉంటుంది. ఏది నిజం? ఏది అబద్ధం? అనే విషయాన్ని ప్రజలు గుర్తించలేని పరిస్థితి ఏర్పడితే సమాజంలో విశ్వాస సంక్షోభం ఏర్పడుతుంది. భవిష్యత్తులో ప్రజలు చూసిన వీడియోను కూడా పూర్తిగా నమ్మలేని పరిస్థితి వస్తే సమాచార వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. దేశాల మధ్య అపోహలు పెంచేందుకు, ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసేందుకు కూడా ఏఐ ఆధారిత తప్పుడు సమాచారాన్ని ఉపయోగించవచ్చు.

స్వయంచాలక ఆయుధ వ్యవస్థలు మరో అత్యంత ప్రమాదకరమైన రంగం. యుద్ధంలో లక్ష్యాలను గుర్తించడం, సమాచారాన్ని విశ్లేషించడం, దాడి చేయడం వంటి పనుల్లో ఏఐ పాత్ర పెరుగుతోంది. మానవ జోక్యం లేకుండా లక్ష్యాన్ని ఎంచుకుని దాడి చేసే వ్యవస్థలు విస్తృతంగా ఉపయోగంలోకి వస్తే యుద్ధ స్వరూపమే మారిపోతుంది. తప్పు సమాచారం, సాంకేతిక లోపం లేదా దురుద్దేశపూర్వక ప్రోగ్రామింగ్ కారణంగా ఒక యంత్రం తీసుకున్న తప్పు నిర్ణయం వేలాది మంది ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవచ్చు. ప్రాణాలు తీసే తుది నిర్ణయాన్ని పూర్తిగా యంత్రానికి అప్పగించడం తీవ్రమైన నైతిక, మానవతా సమస్యలకు దారితీస్తుంది. సైబర్ ప్రపంచంలోనూ ఏఐ కొత్త ముప్పులను సృష్టిస్తోంది. నకిలీ సందేశాలు, మోసపూరిత సమాచారాన్ని సహజంగా రూపొందించడం సులభమవుతోంది. బ్యాంకింగ్, ప్రభుత్వ సంస్థలు, విద్యుత్తు, రవాణా వంటి కీలక మౌలిక వ్యవస్థలపై ఏఐ ఆధారిత సైబర్ దాడులు జరిగితే వాటి ప్రభావం కోట్లాది మంది జీవితాలపై పడవచ్చు. ఒక దేశం మరో దేశంపై సంప్రదాయ యుద్ధం చేయకుండానే డిజిటల్ వ్యవస్థలపై దాడి చేసే అవకాశం కూడా పెరుగుతోంది. అయితే ఏఐ ప్రమాదాన్ని కేవలం "యంత్రాల తిరుగుబాటు"గా చూడటం సరైంది కాదు. అసలు ముప్పు మానవ నిర్లక్ష్యం, అధిక లాభాల ఆశ, రాజకీయ ప్రయోజనాలు, సైనిక ఆధిపత్య పోటీ నుంచి కూడా రావచ్చు. ప్రపంచంలోని పెద్ద సాంకేతిక సంస్థలు అత్యంత శక్తివంతమైన ఏఐ వ్యవస్థను ఎవరు ముందుగా రూపొందిస్తారనే పోటీలో ఉన్నాయి. ఈ పోటీలో భద్రత కంటే వేగానికి ప్రాధాన్యం పెరిగితే ప్రమాదాలు మరింత పెరుగుతాయి. కొత్త ఔషధం లేదా విమానం విడుదలకు ముందు కఠినమైన పరీక్షలు నిర్వహించినట్లే, అత్యంత శక్తివంతమైన ఏఐ వ్యవస్థలను కూడా సమగ్రంగా పరీక్షించాల్సిన అవసరం ఉంది.

ఉద్యోగ రంగంలోనూ ఏఐ భారీ మార్పులకు కారణమవుతోంది. గత పారిశ్రామిక విప్లవాలు ప్రధానంగా శారీరక శ్రమను తగ్గించాయి. కానీ ఏఐ మేధో సంబంధిత పనుల్లోకి కూడా ప్రవేశిస్తోంది. రచన, అనువాదం, లెక్కలు, సమాచార విశ్లేషణ, వినియోగదారుల సేవలు, రూపకల్పన వంటి అనేక రంగాల్లో దాని వినియోగం పెరుగుతోంది. ఉత్పాదకత పెరగడం, కొత్త ఉద్యోగాలు ఏర్పడడం సాధ్యమే. అయితే సంప్రదాయ ఉద్యోగాలు తగ్గిపోవడం లేదా వాటి స్వరూపం మారడం కూడా జరుగుతుంది. కొత్త నైపుణ్యాలు నేర్చుకోలేని వర్గాలు వెనుకబడితే ఆర్థిక అసమానతలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. ఏఐ వల్ల వచ్చే మరో నిశ్శబ్ద ప్రమాదం మానవుడి స్వతంత్ర ఆలోచనా సామర్థ్యం తగ్గిపోవడం. ప్రతి ప్రశ్నకు వెంటనే సమాధానం చెప్పే వ్యవస్థలు అందుబాటులోకి వచ్చినప్పుడు విద్యార్థులు స్వయంగా చదవడం, పరిశోధించడం, విశ్లేషించడం కంటే ఏఐ ఇచ్చిన సమాధానాలను నేరుగా ఉపయోగించే పరిస్థితి ఏర్పడవచ్చు. విద్య అంటే కేవలం సరైన సమాధానం తెలుసుకోవడం కాదు. ప్రశ్నను అర్థం చేసుకోవడం, కారణాలను విశ్లేషించడం, విభిన్న కోణాలను పరిశీలించడం, కొత్త పరిష్కారాలను కనుగొనడం కూడా. అందువల్ల ఏఐ విద్యార్థికి సహాయకుడిగా ఉండాలి తప్ప అతని ఆలోచనా స్థానాన్ని భర్తీ చేయకూడదు. ఈ నేపథ్యంలో ఏఐ అభివృద్ధిని పూర్తిగా ఆపడం పరిష్కారం కాదు. అదే సమయంలో నియంత్రణ లేకుండా వదిలేయడం కూడా ప్రమాదకరం. అభివృద్ధి, భద్రత మధ్య సమతుల్యత అవసరం. కొత్త ఏఐ వ్యవస్థను ప్రజలకు అందుబాటులోకి తెచ్చే ముందు దాని సామర్థ్యాలను మాత్రమే కాకుండా దుర్వినియోగ అవకాశాలను కూడా పరిశీలించాలి. ప్రమాదకర పరిస్థితుల్లో అది ఎలా స్పందిస్తుంది? దుష్టశక్తులు దానిని ఎలా ఉపయోగించగలవు? మానవ నియంత్రణను ఎలా నిర్ధారించాలి? వంటి అంశాలపై కఠినమైన పరీక్షలు అవసరం.

సంస్థల్లో స్వతంత్ర భద్రతా నిపుణుల వ్యవస్థ ఉండాలి. ఏఐని అభివృద్ధి చేసిన సంస్థే దాని భద్రతను పూర్తిగా అంచనా వేయడం సరిపోదు. వ్యాపార ప్రయోజనాలు, పోటీ ఒత్తిడి భద్రతా లోపాలను తక్కువగా చూపించే అవకాశం ఉంది. కాబట్టి స్వతంత్ర నిపుణులు నిరంతరం వ్యవస్థలను పరిశీలించి ప్రమాదాలను ముందుగానే గుర్తించాలి. అలాగే ప్రపంచవ్యాప్తంగా కనీస ఏఐ భద్రతా ప్రమాణాలు అమలులోకి రావాలి. ఒక సంస్థ నియమాలు పాటిస్తుంటే, మరో సంస్థ వాటిని పట్టించుకోకుండా వేగంగా అభివృద్ధి చేస్తే బాధ్యతాయుత సంస్థలు పోటీలో వెనుకబడే పరిస్థితి ఏర్పడుతుంది.

అందుకే అంతర్జాతీయ స్థాయిలో సాధారణ నియమాలు అవసరం. ఏఐ ఆయుధాలు, సైబర్ దాడులు, డీప్‌ఫేక్ నేరాలు, ప్రజాస్వామ్య వ్యవస్థలపై డిజిటల్ దాడులు వంటి అంశాలపై ప్రపంచ దేశాలు పరస్పర సహకారంతో ఒప్పందాలు రూపొందించాలి. భారతదేశం వంటి యువ జనాభా అధికంగా ఉన్న దేశాలకు ఏఐ గొప్ప అవకాశమే. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, పరిపాలన రంగాల్లో దీన్ని సమర్థవంతంగా ఉపయోగిస్తే కోట్లాది మంది జీవితాలను మెరుగుపరచవచ్చు. రైతులకు వాతావరణ సమాచారం, పంటల వ్యాధుల గుర్తింపు, మార్కెట్ విశ్లేషణ అందించవచ్చు. వైద్య నిపుణులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రాథమిక సేవలకు సాంకేతిక సహాయం అందించవచ్చు. విద్యార్థులకు వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా విద్యా సహకారం అందించవచ్చు. అయితే సాంకేతిక వనరులు ఉన్నవారికే ప్రయోజనాలు పరిమితమైతే కొత్త డిజిటల్ అసమానతలు ఏర్పడతాయి. కాబట్టి ఏఐ ప్రయోజనాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా విధానాలు అవసరం.

చివరగా, కృత్రిమ మేధస్సు మానవాళికి వరమా, శాపమా అన్నది ఏఐ స్వభావం నిర్ణయించదు. దానిని ఎవరు అభివృద్ధి చేస్తున్నారు? ఎలాంటి నియమాలతో ఉపయోగిస్తున్నారు? ఎవరి ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారు? అన్నదే భవిష్యత్తును నిర్ణయిస్తుంది. మానవ ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, శాస్త్రీయ పరిశోధన, ప్రకృతి వైపరీత్యాల అంచనా వంటి రంగాల్లో ఉపయోగిస్తే ఏఐ మానవ నాగరికతకు గొప్ప వరంగా నిలుస్తుంది. కానీ లాభాలు, ఆధిపత్యం, రాజకీయ నియంత్రణ, యుద్ధ ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగిస్తే అదే సాంకేతికత మానవాళికి పెద్ద సవాలుగా మారుతుంది. మానవ మేధస్సు సృష్టించిన కృత్రిమ మేధస్సు చివరికి మానవుడికి సేవ చేయాలి తప్ప మానవుడిని శాసించే శక్తిగా మారకూడదు. యంత్రాలకు మేధస్సు పెరుగుతున్న కొద్దీ, వాటిని నియంత్రించే మానవ బాధ్యత కూడా పెరగాలి. ఏఐకి కళ్లెం వేయడం అంటే అభివృద్ధిని అడ్డుకోవడం కాదు; ఆ అభివృద్ధి మానవాళి చేతుల్లోనే ఉండేలా భవిష్యత్తును సురక్షితం చేయడం. సాంకేతికత ఎంత శక్తివంతమైనదైనా మానవ విలువల కంటే గొప్పది కాదు. ఏఐ భవిష్యత్తుపై చర్చ కేవలం సాంకేతిక అంశంగా కాకుండా మానవ స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సామాజిక సమానత్వం, భవిష్యత్ తరాల భద్రతకు సంబంధించిన చర్చగా మారాల్సిన సమయం ఇదే.

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.